# అఖండ భూమి

AKANDA BHOOMI TELUGU DAILY

ఎడిటర్ : యం. ఈశ్వరయ్య    సంచలన దినపత్రిక

ప్రచురణ: కర్నూలు,ఆంధ్రప్రదేశ్ సంపుటి : 04 సంచిక : 86 ఎడిటర్ : ఎం ఈశ్వరయ్య పేజీలు : 08, శనివారం 23-05-2026 సెల్ : 9440912389, 9490315559 వెల రూ. 2 రూ/

Published From kurnool : Circulated at Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor, Kurnool,




వచ్చే నెలలో చంద్రబాబు, లోకేష్ సింగపూర్ పర్యటన



పోలాండ్‌కు 5 వేల మంది సైనికుల్ని పంపుతున్న అమెరికా

# కిడ్నీ మార్పిడిలో నిమ్స్ రికార్డు

వైద్యులను అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి

- కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల్లో నిమ్స్ ఘనత
- 2000 ఆపరేషన్లు పూర్తి చేసి దేశంలో మూడో స్థానంలో నిలిచిన ఆసుపత్రి
- వైద్య బృందాన్ని ప్రత్యేకంగా అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి
- 95 శాతం ఆపరేషన్లు ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా నిర్వహించడం విశేషం
- దక్షిణ భారత దేశంలో కిడ్నీ మార్పిడులలో నిమ్స్ మొదటి స్థానం



2లో

హైదరాబాద్ నగరంలోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) యూరాలజీ విభాగం వైద్య చరిత్రలో అరుదైన మైలురాయిని అందుకుంది. ఇప్పటివరకు 2,000 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను విజయవంతంగా

## మహిళా సంఘాలకు రుణాలపై భట్టివిక్రమార్క శుభవార్త



- వడ్డీలేని రుణాలను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతామన్న భట్టివిక్రమార్క
- సంక్షేమ పథకాలు, ఆర్థిక స్వావలంబన, ఫ్యూచర్ సిటీ నిర్మాణం వంటి వాటికి ప్రాధాన్యత
- వ్యవసాయ రంగంలో లక్ష్యాలను మించి రుణాలు ఇస్తున్నాయని బ్యాంకులకు కితాబు

మహిళా స్వయం సహాయక సంఘాలకు ఇచ్చే వడ్డీలేని రుణాలను రూ.5 లక్షల - మిగతా 2 లో

## బండి భగీరథ్ అరెస్టు విషయంలో రేవంత్ రెడ్డి అలా

బండి సంజయ్ ఇలా: కేటీఆర్ విమర్శలు



- బండి సంజయ్ లొంగుబాటు అంటే, రేవంత్ రెడ్డి అరెస్టు అంటున్నారని ఆగ్రహం
- ఇద్దరు తోడు దొంగలు కలిసి డ్రామాలు ఆడుతున్నారని విమర్శ
- రేవంత్ రెడ్డికి హైట్ మాత్రమే తక్కువ కాదు బుర్ర కూడా తక్కువ అని ఎద్దేవా

బండి భగీరథ్ లొంగిపోయాడని కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ చెబితే, - మిగతా 2 లో

# హర్మూజ్ జలసంధి వద్ద ఇరాన్ టోల్ వసూలు

- వసూళ్లు అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమన్న మార్కో రుబియో
- అంతర్జాతీయ నౌకా రవాణా మార్గాల్లో రాకపోకలను నిర్ణయించే హక్కు ఏ దేశానికి లేదన్న అమెరికా
- టోల్ వసూలు చేయాలని నిర్ణయిస్తే శాంతి చర్చలను సంక్లిష్టం చేసినట్లే అన్న అమెరికా



హర్మూజ్ జలసంధి వద్ద టోల్ వసూలు చర్యలను ఏ దేశం కూడా అంగీకరించకూడదని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో అన్నారు. హర్మూజ్ మీదుగా ప్రయాణించే నౌకలపై టోల్ వసూలు చేయాలని ఇరాన్ యోచిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. దీనిపై అమెరికా స్పందించింది. ఇలాంటి వసూళ్లు అంతర్జాతీయ చట్టాలకు - మిగతా 2 లో

## మస్క్ వెనక నిలబడ్డ ఆ వెయిట్రెస్ చైనా మిలిటరీ ఆఫీసరా?

- ట్రంప్ చైనా పర్యటనలో మస్క్
- ఆయనపై చైనా గూఢచర్యం నెరిపినట్లు వార్తలు
- బీజింగ్ విందులో మస్క్ వెనుక వెయిట్రెస్
- ఆమె చైనా మిలిటరీ కమాండర్ అని బ్లాగర్ జెంగ్ ఆరోపణ
- ఆమె డ్రెస్ కింద గన్ అని అనుమానం



అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చైనా పర్యటనలో.. టెక్ దిగ్గజం ఎలాన్ మస్క్‌పై అక్కడి ప్రభుత్వం నిఘా పెట్టిందనే సంచలన వార్త ఇప్పుడు అంతర్జాతీయంగా కలకలం రేపుతోంది. బీజింగ్‌లో - మిగతా 2 లో

## యువత గళాన్ని నొక్కొద్దు

'కాక్రోచ్ జనతా పార్టీ'పై వేటు అనాలోచితం: శశిథరూర్



- కాక్రోచ్ జనతా పార్టీ 'ఎక్స్' ఖాతా నిలిపివేతపై శశిథరూర్ అభ్యంతరం
- యువత భావప్రకటనా స్వేచ్ఛకు ఇది విఘాతమన్న కాంగ్రెస్ ఎంపీ
- ప్రజాస్వామ్యంలో వ్యంగ్యం, విమర్శలకు చోటు ఉండాలని వ్యాఖ్య
- కొన్ని రోజుల్లోనే కోట్లాది ఫాలోవర్లను సంపాదించిన కాక్రోచ్ పార్టీ
- ఈ అవకాశాన్ని ప్రతిపక్షాలు సద్వినియోగం చేసుకోవాలని థరూర్ సూచన

ఇంటర్నెట్‌లో సంచలనం సృష్టిస్తున్న వ్యంగ్యాస్త్ర వేదిక 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) 'ఎక్స్' ఖాతాను - మిగతా 2 లో

# భారత్, సైప్రస్ సంబంధాలు వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి

- కొత్త వేగాన్ని అందించడానికి రెడీ: మోదీ
- ఉగ్రవాదం కట్టడికి జాయింట్ వర్కింగ్ గ్రూప్
- ఇది భవిష్యత్ దృష్టితో కూడుకున్న అనుబంధం : ప్రధాని మోదీ
- భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం- భారత్‌కు మద్దతు : సైప్రస్



2లో

భారత్, సైప్రస్‌లు తమ సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి పెంచుకున్నాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వెల్లడించారు. భారత్, సైప్రస్ అనుబంధం కాలపరీక్షలో పదేపదే నిలుస్తూ వచ్చిందని ఆయన తెలిపారు. ఇప్పుడు భారత్-సైప్రస్ వ్యూహాత్మక భాగస్వామ్యం ఏర్పాటుతో ఇరుదేశాల సంబంధాలకు కొత్త ఆశయాలు, కొత్త వేగాన్ని అందించడానికి సిద్ధమయ్యామని చెప్పారు. మే 20 నుంచి భారత పర్యటనలో ఉన్న సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్, శుక్రవారం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. ఈ ద్వైపాక్షిక సమావేశం అనంతరం నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో భారత ప్రధాని ప్రసంగించారు. గత దశాబ్ద కాలంలో భారత్‌లోకి

## నేరగాడి కులం అడిగి కాల్చమంటారా?



- బిహార్‌లో ఎన్‌కౌంటర్లపై తీవ్రమైన రాజకీయ వివాదం
- కుల ప్రాతిపదికన ఎన్‌కౌంటర్లు జరుగుతున్నాయన్న తేజస్వి యాదవ్
- తేజస్వి ఆరోపణల్లో ఇంగితజ్ఞానం లేదన్న ముఖ్యమంత్రి సమ్రాట్ చౌదరి
- సుపరిపాలనే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేసిన సీఎం

బీహార్‌లో పోలీస్ ఎన్‌కౌంటర్లపై రాజకీయ దుమారం చెలరేగింది. రాష్ట్రంలో కుల - మిగతా 2 లో

## రాయలసీమలో మెగా సోలార్ ప్రాజెక్టు ప్రారంభం

సీఎం చంద్రబాబు స్పందన



- రాయలసీమలో 600 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టును ప్రారంభించిన మంత్రి నారా లోకేష్
- సోషల్ మీడియా వేదికగా స్పందించిన సీఎం చంద్రబాబు
- రూ.3000 కోట్ల పెట్టుబడితో 11 నెలల్లోనే నిర్మాణం పూర్తి
- పరిశుభ్ర ఇంధన రంగంలో ఏపీ ముందు వరుసలో ఉందని వెల్లడి
- రికార్డు సమయంలో ప్రాజెక్ట్ పూర్తి చేసిన ఎస్ఏఈఎల్ బృందానికి అభినందనలు

కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం, కొండాపురం మండలం టి.కొండూరు గ్రామంలో - మిగతా 2 లో

## లోక్ సభ సీట్లపై నారా లోకేష్ వర్సెస్ షర్మిల



- నియోజకవర్గాల పునర్విభజనపై లోకేష్ గందరగోళం సృష్టిస్తున్నారని షర్మిల విమర్శ
- జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలను శిక్షించవద్దని కాంగ్రెస్ వాదన
- సీట్లు పెంచడం కాదు, పార్లమెంటులో సాపేక్ష ప్రాతినిధ్యమే కీలకమని స్పష్టీకరణ
- దక్షిణాది ప్రయోజనాలపై బీజేపీ స్పష్టమైన రాజ్యాంగ హామీ ఇవ్వలేదని ఆరోపణ
- సమాఖ్య స్ఫూర్తిని వదిలి టీడీపీ ఇప్పుడు బీజేపీని సమర్థిస్తోందని విమర్శ

లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై టీడీపీ నేత నారా లోకేష్ లేనిపోని గందరగోళం - మిగతా 2 లో

# మా నాన్న ఉత్తరం రాశారు

మా తాత కల కన్నారు అంటే నమ్మేవాళ్ళు ఎవరూ లేరు బ్రదర్

- జమ్మలమడుగులో రూ.3 వేల కోట్ల ఎస్ఏఈఎల్ సోలార్ ప్రాజెక్టును ప్రారంభించిన మంత్రి లోకేష్
- ఇది దార్శనికత, నమ్మకం, వేగానికి ప్రతిరూపమని వ్యాఖ్య
- మా బ్రాండ్ ఉద్యోగాల కల్పన అయితే, మీ బ్రాండ్ గొడ్డలి అంటూ పరోక్ష విమర్శలు
- రికార్డు స్థాయిలో కేవలం 11 నెలల్లోనే 600 మెగావాట్ల ప్రాజెక్టు పూర్తి
- బ్రాండ్ చంద్రబాబు, డబుల్ ఇంజిన్ సర్కార్ వల్లే అభివృద్ధి పరుగులు పెడుతోందని వెల్లడి



2లో

ఒక ప్రాజెక్టు ప్రారంభమవ్వడమంటే కేవలం రిబ్బన్ కటింగ్ కాదని, అది దార్శనికత, నమ్మకం, వేగం, కార్యనిర్వహణల కలయిక అని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్య శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. శుక్రవారం జమ్మలమడుగు నియోజకవర్గం, కొండాపురం మండలం టి.కొండూరు గ్రామంలో రూ.3,000 కోట్లతో నిర్మించిన సుఖ్ బీర్ ఆగ్రో ఎనర్జీ లిమిటెడ్ (గాూజూా) వారి 600 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో లోకేష్ మాట్లాడుతూ, "మా నాన్న ఉత్తరం రాశారు, మా తాత కల కన్నారు, నేను ఆత్మలతో మాట్లాడాను అంటే ఇప్పుడు నమ్మేవాళ్ళు ఎవరూ లేరు బ్రదర్. మా బ్రాండ్ జాబ్ క్రియేషన్ అయితే... మీ బ్రాండ్ గొడ్డలి" అంటూ పరోక్షంగా విమర్శలు గుప్పించారు.

# రాయలసీమలో మెగా సోలార్ ప్రాజెక్టు ప్రారంభం

మొదటిపేజీ తరువాయి – రూ.3,000 కోట్లతో నిర్మించిన సుఖ్ బీర్ ఆగ్రో ఎనర్జీ లిమిటెడ్ (రాూజుజూ) 600 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టును ఏపీ మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. దీనిపై సీఎం చంద్రబాబు సోషల్ మీడియా వేదికగా స్పందించారు. రికార్డు సమయంలో ప్రాజెక్టు పూర్తయిందని తెలిపారు. "వ్యాపార నిర్వహణ వేగం (స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్), కార్యనిర్వహణ వేగం (స్పీడ్ ఆఫ్ ఎగ్జిక్యూషన్) రెండూ కలిసిన ప్రదేశం ఆంధ్రప్రదేశ్ అని చెప్పడానికి నేను గర్వపడుతున్నాను. ఈ రోజు, రాయలసీమలో ఎస్ఏఈఎల్ సంస్థ నిర్మించిన 600 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టును మన ప్రజలకు అంకితం చేశాం. రూ.3,000 కోట్ల పెట్టుబడితో కేవలం 11 నెలల రికార్డు సమయంలో ఈ చరిత్రాత్మక ప్రాజెక్టును పూర్తి చేయడం జరిగింది. సుస్థిర భవిష్యత్తు పట్ల మాకున్న తిరుగులేని నిబద్ధతకు ఇది నిదర్శనం. భారతదేశ స్వచ్ఛ ఇంధన ప్రయాణంలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలబెడుతున్న ఇలాంటి ప్రాజెక్టులు మాకు ఎంతో గర్వకారణం. ఈ ప్రాజెక్టును ఇంత తక్కువ సమయంలో పూర్తి చేసిన ఎస్ఏఈఎల్ ఇండియా బృందానికి నా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను. ఈ ప్రాజెక్టు ద్వారా మన ప్రజలకు ఉద్యోగాలు, అభివృద్ధి, కొత్త అవకాశాల రూపంలో గణనీయమైన ప్రయోజనాలు చేకూరుస్తాయని నేను మనస్ఫూర్తిగా విశ్వసిస్తున్నాను" అని చంద్రబాబు పేర్కొన్నారు.

# కిడ్నీ మార్పిడిలో నిమ్స్ రికార్డు

మొదటిపేజీ తరువాయి – పూర్తి చేసి రికార్డు సృష్టించింది. ఈ చారిత్రక ఘనతను సాధించిన నిమ్స్ వైద్య బృందాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఘనతతో నిమ్స్ ఆసుపత్రి.. కిడ్నీ మార్పిడులలో దక్షిణ భారతదేశంలో మొదటి స్థానంలో, దేశవ్యాప్తంగా మూడో స్థానంలో నిలిచింది. దేశంలో గుజరాత్‌లోని ఐకేడీఆర్‌సీ ప్రథమ స్థానంలో, లూధియానా క్రిస్టియన్ మెడికల్ కాలేజీ ద్వితీయ స్థానంలో ఉన్నాయి. నిమ్స్‌లో జరిగిన ఈ 2,000 ఆపరేషన్లలో 1,900 మంది (95 శాతం) రాజీవ్ ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఉచితంగా కిడ్నీ మార్పిడి చేయించుకోవడం గమనార్హం. గడిచిన మూడు సంవత్సరాల నాలుగు నెలల కాలంలోనే నిమ్స్ వైద్యులు 500 కిడ్నీ మార్పిడులు పూర్తి చేశారు. కిడ్నీ బాధితులకు విశేష సేవలు అందిస్తూ, వారి పాలిట వరంగా నిలుస్తున్న నిమ్స్ వైద్య బృందానికి ముఖ్యమంత్రి ప్రశంసలు తెలిపారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ పేదలకు అత్యాధునిక వైద్యాన్ని అందించడంలో నిమ్స్ ఆదర్శంగా నిలుస్తోందని ఆయన కొనియాడారు.

# మహిళా సంఘాలకు రుణాలపై భట్టివిక్రమార్క శుభవార్త

మొదటిపేజీ తరువాయి – నుంచి రూ.10 లక్షలకు పెంచనున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క చెప్పారు. ప్రజాభవన్‌లో 49వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మల్లుభట్టి విక్రమార్క మాట్లాడుతూ, సంక్షేమ పథకాలు, ఆర్థిక స్వావలంబన, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, మహిళా సాధికారత, మూసీ పునరుజ్జీవనం వంటి అంశాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని అన్నారు. వ్యవసాయ రంగానికి సంబంధించి లక్ష్యాలను మించి బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయని ఆయన హర్షం వ్యక్తం చేశారు. పారిశ్రామిక రంగంలో దేశంలోనే అత్యంత వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి అన్నారు. ఈ క్రమంలో సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు, మహిళలు, దళిత, గిరిజన, యువ పారిశ్రామికవేత్తలకు రుణాల పంపిణీపై బ్యాంకులు మరింత దృష్టి పెట్టాలని అన్నారు.ం

# బండి భగీరథ్ అరెస్టు విషయంలో రేవంత్ రెడ్డి అలా

మొదటిపేజీ తరువాయి – పోలీసులే అరెస్టు చేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆయన లొంగుబాటు అంటే, ఈయన అరెస్టు అని చెప్పడం విడ్డూరమని అన్నారు. ఇద్దరు తోడు దొంగలని, వారు కలిసి డ్రామాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డికి హైట్ ఒక్కటే తక్కువ అనుకున్నానని, కానీ బుర్ర కూడా తక్కువేనని ఎద్దేవా చేశారు. బండి భగీరథ్‌కు ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నాలు చేశారని, కానీ హైకోర్టులో అనుకూలంగా తీర్పు రాలేదని కేటీఆర్ తెలిపారు. ఒక అమ్మాయికి అన్యాయం జరిగితే ఆ అమ్మాయి వివరాలు బయటపెట్టింది బీజేపీవారే అన్నారు. పేట్ బషీరాబాద్‌లో 15 మందిపై కేసులు నమోదయ్యాయని, వారంతా బీజేపీవారే అన్నారు. ఇటీవల ప్రధాని నరేంద్రమోదీ తెలంగాణ పర్యటనకు వచ్చి చావు కబురు చల్లగా చెప్పారని విమర్శించారు. రైతులు యూరియా ఉపయోగించడం తక్కువ చేయాలని, ప్రజలు బంగారం కొనుగోలు తగ్గించాలని చెప్పారని గుర్తు చేశారు. ఇప్పటికే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నంత కాలం వచ్చే సీజన్‌లో కూడా రైతులకు ఇబ్బంది తప్పదని అన్నారు. రాష్ట్రంలో గన్నీ బ్యాగులు దొరకడం లేదు కానీ గన్‌లు మాత్రం బాగా దొరుకుతున్నాయని కేటీఆర్ విమర్శించారు.

# హర్మ్యూజ్ జలసంధి వద్ద ఇరాన్ టోల్ వసూలు

మొదటిపేజీ తరువాయి – విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయ నౌకా రవాణా మార్గాల్లో రాకపోకలను నిర్ణయించే హక్కు ఏ దేశానికి లేదని స్పష్టం చేశారు. హర్మ్యూజ్ వద్ద స్వేచ్ఛాయుత నౌకాయానానికి ఎవరూ భంగం కలిగించలేరని అన్నారు. ఇరాన్ టోల్ వసూలు చేయాలని నిర్ణయిస్తే రెండు దేశాల మధ్య శాంతి చర్చలను మరింత సంక్లిష్టం చేసినట్లే అని పేర్కొన్నారు. హర్మ్యూజ్ జలసంధిని దాటే నౌకల నుంచి పెద్ద మొత్తంలో టోల్ వసూలు చేయడం ప్రారంభమైందని ఇరాన్ అధికారిక మీడియా పేర్కొంది. ఈ క్రమంలో నౌకల యజమానులు, అందులో ఉన్న సరకు, అవి చేరుకోవాల్సిన గమ్యస్థానాల గురించి పూర్తి సమాచారాన్ని ఇరాన్ అధికారులకు ముందే తెలియజేయాల్సి ఉంటుందని పేర్కొంది. హర్మ్యూజ్‌పై నియంత్రణ కోసం, అమెరికాతో యుద్ధం కారణంగా జరిగిన నష్టాన్ని ఈ టోల్ ద్వారా కొంత పూడ్చుకోనున్నట్లు తెలిపింది. అయితే ఇరాన్ నుంచి అధికారిక ప్రకటన మాత్రం రాలేదు.

# నేరగాడి కులం అడిగి కాల్చమంటారా?



మొదటిపేజీ తరువాయి – ప్రాతిపదికన ఎన్‌కౌంటర్లు జరుగుతున్నాయంటూ ప్రతిపక్ష నేత తేజస్వి యాదవ్ చేసిన ఆరోపణలపై ముఖ్యమంత్రి సమ్రాట్ చౌదరి తీవ్రంగా స్పందించారు. "అంటే, పోలీసులు ముందు నేరగాడి కులం అడిగి, ఆ తర్వాతే కాల్పులు జరపాలా?" అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. రాష్ట్రంలో నేరగాళ్ల కులాన్ని నిర్ధారించుకున్న తర్వాతే వారిని లక్ష్యంగా చేసుకుంటున్నారని తేజస్వి యాదవ్ ఇటీవల ఆరోపించారు. ఈ నేపథ్యంలో పట్నాలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో సీఎం సమ్రాట్ చౌదరి ఈ వ్యాఖ్యలు చేశారు. తేజస్వి ఆరోపణల్లో ఇంగితజ్ఞానం లేదని, ఇలాంటి వ్యాఖ్యలకు అర్థం పర్థం లేదని కొట్టిపారేశారు. హోం శాఖను కూడా నిర్వహిస్తున్న సమ్రాట్ చౌదరి మాట్లాడుతూ "సుపరిపాలన అందించడమే ఎన్డీఏ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. శాంతిభద్రతల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు. పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చాం. పోలీసులను ఎవరైనా సవాల్ చేస్తే 48 గంటల్లోగా స్పందించాలని ఆదేశాలు జారీ చేశాం" అని స్పష్టం చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పటిష్ఠంగా ఉంటేనే పెట్టుబడులు వస్తాయని ఆయన అన్నారు. "ప్రధాని నరేంద్ర మోదీ, మాజీ సీఎం నితీశ్ కుమార్ ఆశీస్సులతో బిహార్ వేగంగా అభివృద్ధి చెందుతోంది. నవంబర్ 20, 2026 నాటికి రాష్ట్రానికి రూ. 5 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నాం" అని వివరించారు. పోలీసు సిబ్బంది సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని కూడా ఆయన హామీ ఇచ్చారు. ప్రస్తుతం బిహార్‌లో శాంతిభద్రతల అంశంపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. పెరుగుతున్న నేరాలపై ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుంటుండగా, నేరగాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని అధికార ఎన్డీఏ కూటమి స్పష్టం చేస్తోంది.

# లోక్ సభ సీట్లపై నారా లోకేష్ వర్సెస్ షర్మిల

మొదటిపేజీ తరువాయి – సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రంగా విమర్శించారు. జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేసి, మెరుగైన మానవాభివృద్ధి సూచికలను సాధించిన దక్షిణాది రాష్ట్రాలను రాజకీయంగా శిక్షించకూడదన్నదే తమ పార్టీ స్పష్టమైన వైఖరి అని ఆమె పునరుద్ఘాటించారు. కేవలం లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచడం ద్వారా దక్షిణాది రాష్ట్రాలకు రక్షణ లభించదని, పార్లమెంటులో వాటి సాపేక్ష ప్రాతినిధ్యం, రాజకీయ పలుకుబడి తగ్గకుండా చూడటమే అసలైన సవాల్ అని ఆమె అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత పి.చిదంబరం ట్వీట్ కు బదులిస్తూ నారా లోకేష్ చేసిన పోస్ట్ పై షర్మిల ఈ విధంగా స్పందించారు. ఈ అంశంపై శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. "దక్షిణాది రాష్ట్రాల గొంతుకను తగ్గించే ఎలాంటి పునర్విభజన ప్రక్రియనైనా కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచీ వ్యతిరేకిస్తోంది. దీనిపై తిరుగులేని రాజ్యాంగ హామీ ఉండాలని మేం డిమాండ్ చేశాం. ఆర్టికల్ 81 ప్రకారం చూస్తే, ఆంధ్రప్రదేశ్‌కు సంఖ్యాపరంగా సీట్లు పెరిగినా, అధిక జనాభా ఉన్న ఉత్తరాది రాష్ట్రాలతో పోలిస్తే దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్య బలం, నిర్ణయాధికారం తగ్గిపోయే ప్రమాదం ఉంది," అని షర్మిల ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ సమస్యకు ప్రత్యామ్నాయాలను అన్వేషించడంలో విఫలమైందని ఆమె ఆరోపించారు. "రాజ్యాంగ నిపుణులు సూచించినట్లుగా స్థానిక సంస్థలను బలోపేతం చేయడం, రాష్ట్రాలకు, స్థానిక సంస్థలకు మరిన్ని ఆర్థిక, పరిపాలనా అధికారాలు ఇవ్వడం, వికేంద్రీకరణను ప్రోత్సహించడం వంటి మార్గాలను కేంద్రం ఏమాత్రం పట్టించుకోలేదు. కేవలం లోక్‌సభ సీట్లను పెంచడమే ఏకైక పరిష్కారంగా చూపింది," అని ఆమె పేర్కొన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వ హయాంలో పార్లమెంటు సమావేశాల రోజుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని, ఇప్పటికే జాతీయ చర్చల్లో దక్షిణాది రాష్ట్రాల వాణిని అణచివేస్తున్నారని షర్మిల విమర్శించారు. "సమాఖ్య సమతౌల్యాన్ని, పార్లమెంటరీ పనితీరును కాపాడకుండా సభను విస్తరిస్తే, వ్యక్తిగత ప్రాతినిధ్యం, అర్థవంతమైన చర్చ మరింత బలహీనపడతాయి. దక్షిణాది రాజకీయ ప్రాబల్యాన్ని శాశ్వతంగా కాపాడతామని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ఎప్పుడూ స్పష్టమైన రాజ్యాంగ హామీ ఇవ్వలేదు. ఒకప్పుడు సమాఖ్య స్ఫూర్తి కోసం, దక్షిణాది ప్రయోజనాల కోసం పోరాడిన టీడీపీ, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌కు, దక్షిణాదికి ఎలాంటి రక్షణలు కోరకుండా బీజేపీ అస్పష్ట వైఖరిని సమర్థించడం విడ్డూరంగా ఉంది," అని ఆమె అన్నారు. సమాఖ్య సమతౌల్యాన్ని, దక్షిణాది ప్రాతినిధ్యాన్ని, సహకార సమాఖ్య స్ఫూర్తిని కాపాడటమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని, మెరుగైన పాలన అందించిన రాష్ట్రాలను రాజకీయంగా శిక్షించే వ్యవస్థగా భారత ప్రజాస్వామ్యం మారకూడదని షర్మిల స్పష్టం చేశారు. ఈ మేరకు నారా లోకేష్ చేసిన ఓ ట్వీట్ ను ఆమె రీపోస్ట్ చేశారు.

### నారా లోకేష్ ఏమన్నారంటే..!

లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశంపై ఏపీ మంత్రి నారా లోకేష్, కాంగ్రెస్ పార్టీ అగ్రనేత చిదంబరంను లక్ష్యంగా చేసుకుని పలు కీలక ప్రశ్నలు సంధించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 81 ప్రకారం 1971 జనాభా లెక్కల ఆధారంగా లోక్‌సభ సీట్ల కేటాయింపు జరిగిందని, ఆ నిబంధన 2026 తర్వాత జరిగే తొలి జనాభా గణనతో ముగియనుందని ఆయన గుర్తుచేశారు. ఈ పరిణామం దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు చిదంబరంను ఉద్దేశించి లోకేష్ ట్వీట్ చేశారు. "డియర్ సర్... భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 81 ప్రకారం, లోక్‌సభలో రాష్ట్రాల సీట్ల కేటాయింపు 1971 జనాభా లెక్కల ఆధారంగా నిలిపివేయబడిందన్న విషయం మీకు తెలియంది కాదు. 2026 తర్వాత జరిగే మొదటి జనాభా గణనతో ఈ నిలుపుదల ముగుస్తుంది. ఆ తర్వాత నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) తప్పనిసరిగా జరుగుతుంది. దీనివల్ల దక్షిణాది రాష్ట్రాలన్నీ, ఒక్కటి కూడా మినహాయింపు లేకుండా, ఉత్తరాది రాష్ట్రాలతో పోలిస్తే పార్లమెంటులో తమ ప్రాతినిధ్యాన్ని కోల్పోతాయి. ఈ అసమతుల్యత గురించే మేము మొదటి నుంచి ఆందోళన వ్యక్తం చేస్తున్నాం. ఈ సమస్యను పరిష్కరించేందుకే ఎన్డీయే ప్రభుత్వం డీలిమిటేషన్ బిల్లును, అన్ని రాష్ట్రాలకు దామాషా ప్రకారం సీట్లు పెంచే ప్రతిపాదనను ముందుకు తెచ్చింది. మీలాంటి న్యాయ నిపుణులకు ఈ రాజ్యాంగపరమైన అంశాలు పూర్తిగా తెలుసు. మరి అలాంటప్పుడు, పార్లమెంటులో కాంగ్రెస్ పార్టీ ఆ బిల్లును ఎందుకు వ్యతిరేకించింది? దక్షిణాది దీర్ఘకాలిక ప్రయోజనాలను పణంగా పెట్టి రాజకీయ లబ్ధి పొందడానికేనా? కాంగ్రెస్ పార్టీ మా సూటి ప్రశ్నలకు సమాధానం చెప్పాలి. ఆర్టికల్ 81 ప్రకారం 2026 తర్వాత ఏం జరుగుతుంది? ఉత్తరాదితో పోలిస్తే దక్షిణాది ప్రాతినిధ్యాన్ని కోల్పోవడం నిజం కాదా? అదే నిజమైనప్పుడు, ఆ నష్టాన్ని నివారించడానికి ఉద్దేశించిన రాజ్యాంగబద్ధమైన ప్రక్రియను మీరెందుకు వ్యతిరేకించారు?" అని లోకేష్ ప్రశ్నల వర్షం కురిపించారు.

# మా నాన్న ఉత్తరం రాశారు

మొదటిపేజీ తరువాయి – **రాష్ట్రం చూపు.. జమ్మలమడుగు వైపు**

రికార్డు సమయంలో ఎస్ఏఈఎల్ ప్రాజెక్టు పూర్తి కావడం స్థానిక రైతుల, జమ్మలమడుగు యువత విజయమని లోకేష్ ప్రశంసించారు. "మీ సహకారం వల్లనే ఈ భారీ ప్రాజెక్టు కేవలం 11 నెలల్లో పూర్తయింది. ఈరోజు రాష్ట్రం మొత్తం జమ్మలమడుగు వైపు చూస్తోంది. ఇక్కడ మెగా సోలార్ పార్క్, అదానీ, చింతా గ్రీన్, జెన్‌కో--ఎన్టీపీసీ పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులతో పాటు ఇప్పుడు ఎస్ఏఈఎల్ ను కూడా తీసుకువచ్చింది మనమే. కంపెనీలు తేవాలన్నా, ఉద్యోగాలు కల్పించాలన్నా అది బ్రాండ్ సీబీఎన్‌కే సాధ్యం" అని లోకేష్ అన్నారు.

### విజయానికి మూడు సూత్రాలు

ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడుల ఆకర్షణ, పరిశ్రమల స్థాపన, ఉద్యోగాల కల్పన విజయవంతం కావడానికి మూడు ముఖ్య కారణాలు ఉన్నాయని లోకేష్ వివరించారు. "మొదటిది -- బ్రాండ్ సీబీఎన్. ఇచ్చిన మాటను నిలబెట్టుకునే నాయకత్వం ఉండటంతో పెట్టుబడిదారులు ఏపీ వైపు చూస్తున్నారు. రెండవది -- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్. వేగంగా నిర్ణయాలు తీసుకుని, ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయడం మా విధానం. ఈ ప్రాజెక్టే దానికి నిదర్శనం. మూడవది -- డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వ మద్దతుతో రాష్ట్ర అభివృద్ధి పరుగులు పెడుతోంది" అని ఆయన పేర్కొన్నారు.

### ప్రపంచంతో పోటీపడే ఎకోసిస్టమ్ నిర్మాణం

ఆంధ్రప్రదేశ్‌లో ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఎనర్జీ, సాఫ్ట్‌వేర్, డ్రోన్‌లు, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాల్లో 22 ప్రత్యేక గ్రోత్ క్లస్టర్లను నిర్మిస్తున్నామని లోకేష్ తెలిపారు. "ఆధునిక ఆర్థిక వ్యవస్థకు ఆవిష్కరణలే కీలకం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి భవిష్యత్తు కోసం ప్రపంచంతో పోటీపడే ఎకోసిస్టమ్‌లను నిర్మిస్తున్నాయి" అని ఆయన వివరించారు.

### ఎస్ఏఈఎల్ తో తొలి పరిచయం

ఎస్ఏఈఎల్ సంస్థతో తన తొలి పరిచయాన్ని లోకేష్ గుర్తుచేసుకున్నారు. "ఢిల్లీలో ఒక టెలికాం ఆపరేటర్ల సమావేశంలో ఎస్ఏఈఎల్ నాయకత్వాన్ని కలిశాను. పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులపై వారికున్న ఉత్సాహం, దీర్ఘకాలిక ప్రణాళిక నన్ను ఆకర్షించింది. వారి తపనను నేను వెంటనే గ్రహించగలిగాను" అని ఆయన నాటి సంఘటనను వివరించారు.

### స్థానిక సమాజంతో మమేకం

పంజాబ్ కేంద్రంగా పనిచేసే ఒక కంపెనీ ఏపీలో విజయవంతం కాగలదా అనే సందేహం మొదట కలిగిందని, కానీ ఎస్ఏఈఎల్ బృందం క్షేత్రస్థాయిలో స్థానిక సమాజంతో మమేకమై పనిచేయడం చూశాక ఆ సందేహం తొలగిపోయిందని లోకేష్ అన్నారు. "వారు రైతులు, గ్రామస్థులు, అధికారులు, కార్మికులతో కలిసికట్టుగా పనిచేసి, వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకుని ముందుకు సాగారు. ఆ స్ఫూర్తే ఈ ప్రాజెక్టు విజయానికి కారణం," అని ఆయన ప్రశంసించారు.

### రికార్డు వేగంతో ప్రాజెక్టు పూర్తి

రాూజుజూ సంస్థ రూ.3,000 కోట్ల పెట్టుబడితో, 2,400 ఎకరాల విస్తీర్ణంలో రెండు భారీ 300 మెగావాట్ల ప్రాజెక్టులను కేవలం 11 నెలల్లో పూర్తి చేసి రికార్డు సృష్టించిందని లోకేష్ తెలిపారు. పంజాబ్, రాజస్థాన్‌లోని ఎస్ఏఈఎల్ సొంత ప్లాంట్లలో తయారైన 12 లక్షలకు పైగా అత్యాధునిక సోలార్ మాడ్యూళ్లను ఈ ప్రాజెక్టులో వినియోగించారు.

### పర్యావరణ పరిరక్షణ, విద్యుత్ ఎగుమతి

ఈ ఒక్క ప్రాజెక్టుతోనే ఏటా సుమారు 11 లక్షల టన్నుల కర్బన ఉద్గారాలను నివారించవచ్చని అంచనా. ఇక్కడ ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను 25 ఏళ్ల ఒప్పందం ప్రకారం సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా జాతీయ గ్రిడ్‌కు సరఫరా చేస్తారు. "ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు కేవలం క్లీన్ ఎనర్జీని వినియోగించడమే కాదు, దేశానికి ఎగుమతి చేసే స్థాయికి ఎదుగుతోంది. భారతదేశ హరిత ఇంధన విప్లవానికి ఏపీ నాయకత్వం వహించడానికి సిద్ధంగా ఉంది," అని లోకేష్ స్పష్టం చేశారు. ఎస్ఏఈఎల్ బృందాన్ని ఉద్దేశించి "తుస్సీ కమాల్ కర్ దిట్టా... చక్ దే ఫట్టే!" అంటూ పంజాబీలో అభినందించారు.

### ఉపాధి, భవిష్యత్ భరోసా

ఈ ప్రాజెక్టు నిర్మాణ సమయంలోనే 1,000 మందికి పైగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించిందని, వీరిలో 80 శాతం స్థానికులేనని లోకేష్ చెప్పారు. 760 మంది రైతులకు దీర్ఘకాలిక లీజు ఒప్పందాల ద్వారా లబ్ధి చేకూరిందన్నారు. వ్యవసాయ వ్యర్థాల నుంచి కూడా విద్యుత్ ఉత్పత్తి చేసే ప్రాజెక్టులను ఎస్ఏఈఎల్ చేపడుతోందని, దీనివల్ల రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని తెలిపారు. ఎస్ఏఈఎల్ సంస్థకు ఎలాంటి మద్దతు కావాలన్నా తాను ఒక వాట్సాప్ కాల్ దూరంలోనే ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు గొట్టిపాటి రవికుమార్, సవిత, కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎస్ఏఈఎల్ కో-ఫౌండర్ సుఖ్ భీర్ సింగ్, సీఈవో లక్షిత్ అవ్లా, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, టీడీపీ ఇంఛార్జ్ భూపేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మస్క్ వెనక నిలబడ్డ ఆ వెయిట్రెస్ చైనా మిలిటరీ ఆఫీసరా?

మొదటిపేజీ తరువాయి – జరిగిన అధికారిక విందులో ఆయన వెనుక నిలబడిన ఓ వెయిట్రెస్ నిలబడింది. ఆమె సాధారణ హోటల్ సిబ్బంది కాదని, చైనా సైన్యానికి చెందిన అత్యున్నత అధికారిణి అని ప్రముఖ బ్లాగర్ ఆరోపించారు.

### వెయిట్రెస్ రూపంలో ఉన్నదెవరు?

స్వతంత్ర బ్లాగర్ జెన్నిఫర్ జెంగ్ సోషల్ మీడియా పోస్టుల ప్రకారం.. ట్రంప్ గౌరవార్థం బీజింగ్‌లో చైనా కమ్యూనిస్ట్ పార్టీ అధికారిక విందు ఏర్పాటు చేసింది. దాంట్లో మస్క్ వెనుక ఎరుపు రంగు దుస్తుల్లో నిలబడిన మహిళ చైనా మిలిటరీకి చెందిన ఓ బెటాలియన్ కమాండర్ మేజర్ చెంగ్ చెంగ్ అని జెంగ్ పేర్కొన్నారు. చైనా సైనిక వేడుకలకు సంబంధించిన ఆపరేషనల్ మ్యాన్యువల్స్ రాయడంలో ఆమె కీలక పాత్ర పోషించారని తెలిపారు.

### రెడ్ డ్రెస్ కింద గన్?

మేజర్ చెంగ్ చెంగ్‌కు సంబంధించిన పాత యూనిఫాం ఫొటోలు, ప్రస్తుత విందు ఫొటోలను జెంగ్ తన సోషల్ మీడియాలో షేర్ చేశారు. అంతేకాదు ఆ వెయిట్రెస్ ధరించిన రెడ్ కలర్ డ్రెస్ కింద గన్ లేదా ఏదైనా నిఘా పరికరం ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. అయితే ఈ ఆరోపణలను ఎంతవరకు నిజమనేది మాత్రం అధికారికంగా ఎవరూ ధృవీకరించలేదు. అటు చైనా ప్రభుత్వం కూడా ఈ విమర్శలపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.


### చైనాకు ఇలాంటి చరిత్ర ఉందా?

పాశ్చాత్య దేశాలను, ప్రముఖులను టార్గెట్ చేయడానికి చైనా ఇలా గూఢచర్యానికి పాల్పడటం ఇదే మొదటిసారి కాదని భద్రతా నిపుణులు చెబుతున్నారు. గతంలో కాలిఫోర్నియాలో అమెరికా రాజకీయ నాయకులను ట్రాప్ చేయడానికి 'ఫాంగ్ ఫాంగ్' అనే మహిళతో చైనా హనీట్రాప్ ఆపరేషన్ నడిపిన దాఖలాలున్నాయి. విదేశీ టెక్ లీడర్లు చైనా మార్కెట్లోకి అడుగుపెట్టే సమయంలో.. అక్కడి ప్రభుత్వం ఇచ్చే ఆతిథ్యం వెనుక ఇలాంటి రహస్య నిఘా కచ్చితంగా ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### నిజ్జర్ హత్య వెనుక చైనా?

బ్లాగర్ జెంగ్ గతంలోనూ చైనా గూఢచర్య వ్యవస్థపై సంచలన ఆరోపణలు చేశారు. 2023లో కెనడాలో ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య వెనుక చైనా కమ్యూనిస్ట్ పార్టీ హస్తం ఉందని చెప్పారు. భారతదేశాన్ని అంతర్జాతీయంగా ఇరికించి పశ్చిమ దేశాలతో సంబంధాలను దెబ్బతీయడానికే చైనా ఆ హత్య చేయించిందని ఆమె వాదించారు.

# యువత గళాన్ని నొక్కొద్దు




మొదటిపేజీ తరువాయి – నిలిపివేయడంపై కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ శశిథరూర్ స్పందించారు. ఈ చర్యను 'అనాలోచితమైన, విపత్కరమైన నిర్ణయం'గా అభివర్ణించారు. యువత తమ భావాలను, అసంతృప్తిని వ్యక్తీకరించడానికి ఒక వేదిక ఉండాలని, దాని గొంతు నొక్కడం సరికాదని ఆయన హితవు పలికారు. కేవలం ఐదు రోజుల్లోనే ఇన్‌స్టాగ్రామ్‌లో 19 మిలియన్లకు పైగా ఫాలోవర్లను సంపాదించిన 'కాక్రోచ్ జనతా పార్టీ' ఎదుగుదల తనను ఎంతగానో ఆకర్షించిందని థరూర్ తన 'ఎక్స్' పోస్టులో పేర్కొన్నారు. చట్టపరమైన డిమాండ్ మేరకు సుమారు 2 లక్షల మంది ఫాలోవర్లు ఉన్న ఈ పార్టీ 'ఎక్స్' ఖాతాను భారత్‌లో నిలిపివేశారు. ఈ నేపథ్యంలో థరూర్ స్పందిస్తూ.. "ప్రజాస్వామ్యంలో అసమ్మతి, హాస్యం, వ్యంగ్యం, చివరకు నిరాశను వ్యక్తీకరించడానికి కూడా వేదికలు అవసరమని" అభిప్రాయపడ్డారు. సీజేపీ ఖాతాను వెంటనే పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఉద్యమం భవిష్యత్తు ఎలా ఉంటుందో తనకు కచ్చితంగా తెలియదని, కానీ దీని వెనుక ఉన్న యువత తమ శక్తిని ప్రధాన స్రవంతి రాజకీయాల్లోకి తీసుకురావాలని లేదా తమ ఓటు ద్వారా మార్పునకు గళం విప్పాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈ పరిణామం యువతలో ఉన్న అసంతృప్తికి నిదర్శనమని, ఇది ప్రతిపక్షాలకు ఒక గొప్ప అవకాశమని థరూర్ విశ్లేషించారు. ప్రతిపక్షాలు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని, యువతను తమ వైపు తిప్పుకునేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు.

### ఏమిటీ కాక్రోచ్ జనతా పార్టీ?

"యువత కోసం, యువత చేత, యువత యొక్క రాజకీయ వేదిక"గా ఇది తమను తాము అభివర్ణించుకుంటోంది. "సోమరులు, నిరుద్యోగుల గొంతుక" అని కూడా వ్యంగ్యంగా పేర్కొంటోంది. అభిజీత్ డిప్కే దీని వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఉన్నారు. పదవీ విరమణ తర్వాత ప్రధాన న్యాయమూర్తులకు రాజ్యసభ సీట్లు ఇవ్వడాన్ని నిషేధించడం, పార్లమెంట్ సభ్యుల సంఖ్య పెంచకుండానే మహిళలకు 50% రిజర్వేషన్ కల్పించడం, పార్టీ ఫిరాయించిన వారిపై 20 ఏళ్ల నిషేధం విధించడం వంటి పలు ఆసక్తికర డిమాండ్లను ఈ పార్టీ తన మేనిఫెస్టోలో చేర్చింది.

# భారత్, సైప్రస్ సంబంధాలు వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి

మొదటిపేజీ తరువాయి – సైప్రస్ పెట్టుబడులు దాదాపు రెట్టింపు అయ్యాయని, ఇది ఇరుదేశాల మధ్య పెరుగుతున్న నమ్మకానికి నిదర్శనమని నరేంద్ర మోదీ తెలిపారు. ఇటీవలె భారత్–యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అనేది రాబోయే రోజుల్లో భారత్ – సైప్రస్‌లకు కొత్త అవకాశాలను సృష్టిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. దీని ఊతంతో రాబోయే ఐదేళ్లలో పెట్టుబడులను రెట్టింపు చేయాలనే లక్ష్యాన్ని ఇరుదేశాలు పెట్టుకున్నాయని చెప్పారు.ఈ విభాగాల్లో ఎంఓయూలు భారత్, సైప్రస్‌లు డిజిటల్ మౌలిక సదుపాయాలు, ఫిన్‌టెక్ నిర్వాహక వ్యవస్థలు, రీసెర్చ్ హబ్‌లు వంటి విభాగాలతో ముడిపడిన పలు అవగాహనా ఒప్పందాల(ఎంఓయూ)పై సంతకాలు చేశాయని ప్రధాని వెల్లడించారు. సంస్థాగత సహకారాలు, విద్యార్థి మార్పిడి కార్యక్రమాలు, ఉమ్మడి శాస్త్రీయ పరిశోధనలను ప్రోత్సహించడంపైనా ఎంఓయూలు కుదిరాయన్నారు. ఇరుదేశాల మధ్య చట్టబద్ధమైన వలసలను ప్రోత్సహించే, అక్రమ వలసలను అరికట్టే ఒప్పందం ఖరారుకు దృఢమైన ఏకాభిప్రాయాన్ని సాధించడంపైనా ఫోకస్ పెట్టాలని నిర్ణయించినట్లు మోదీ తెలిపారు. భారత్– సైప్రస్ మధ్య రాకపోకలు సాగించే వృత్తి నిపుణుల హక్కుల పరిరక్షణకు త్వరలోనే ఒక సామాజిక భద్రతా ఒప్పందాన్ని కుదుర్చుకోవాలని నిర్ణయించామన్నారు. ఉగ్రవాదం కట్టడికి జాయింట్ వర్కింగ్ గ్రూప్ "ఉగ్రవాదం కట్టడి కోసం ఒక జాయింట్ వర్కింగ్ గ్రూప్‌ను ఏర్పాటు చేసే అంశంపై భారత్– సైప్రస్ మధ్య ఎంఓయూ కుదిరింది. తీవ్రవాద భావజాలం, సరిహద్దు ముప్పులను ఎదుర్కోవడానికి ఈ జాయింట్ వర్కింగ్ గ్రూప్ పనిచేస్తుంది. సైబర్ భద్రత, సముద్ర భద్రత, ఉగ్రవాద నిరోధక నెట్‌వర్క్‌ల బలోపేతం, లక్షిత రక్షణ విస్తరణలలోనూ ఇరుదేశాలు కలిసి పనిచేస్తాయి. భారత్, సైప్రస్‌ల మధ్య స్నేహం బలమైనది. ఇది భవిష్యత్ దృష్టితో కూడుకున్నది. ప్రజాస్వామ్యం, చట్టబద్ధమైన పాలన వంటి విలువలకు కట్టుబడి ఉండాలనే ఉమ్మడి నిబద్ధతపై మా భాగస్వామ్యం ఆధారపడి ఉంది. మేం అన్ని దేశాల సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను ప్రగాఢంగా గౌరవిస్తాం. ఈ సూత్రాలను పరిరక్షించడానికి భారతదేశం కట్టుబడి ఉంది" అని ప్రధాని మోదీ తెలిపారు. భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం– భారత్‌కు మద్దతు : సైప్రస్ ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కోసం భారత్ చేస్తున్న ప్రయత్నాలకు తమ మద్దతు ఉంటుందని సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్ ప్రకటించారు. నేటి ప్రపంచ వాస్తవికతలను ప్రతిబింబించేలా భద్రతా మండలి నిర్మాణంలో మార్పులు జరగాలన్నారు. ప్రపంచ వ్యవహారాల్లో పెరుగుతున్న భారత్ పాత్రకు కూడా తమ మద్దతు ఉంటుందని ఆయన తేల్చి చెప్పారు. సైప్రస్‌ను తిరిగి ఏకీకృతం చేసే ప్రయత్నాలకు భారత్ అందిస్తున్న దీర్ఘకాలిక మద్దతును తాము ఎంతగానో గౌరవిస్తామన్నారు. సైప్రస్ గణతంత్ర రాజ్య స్వాతంత్ర్యం, సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతకు స్థిరమైన మద్దతును అందిస్తున్న భారత్‌కు నికోస్ క్రిస్టోడౌలిడెస్ ధన్యవాదాలు తెలియజేశారు. ప్రధాని మోదీ సైప్రస్ పర్యటనతో అద్భుత వేగం "గత ఏడాది మోదీ సైప్రస్ పర్యటనతో ఇరుదేశాల భాగస్వామ్యం అద్భుతమైన వేగంతో, దృఢ నిశ్చయంతో ముందుకు సాగింది.

అఖండ భూమి

శనివారం 23-05-2026

## పవన్ కళ్యాణ్ ప్రజలకు దత్తపుత్రుడు వైయస్ జగన్ కుటుంబ సభ్యులకు దొంగ పుత్రుడు :అనంతపురం జిల్లా జనసేన ఉపాధ్యక్షులు.కుంటిమద్ది జయరాం రెడ్డి



**అనంతపురం ( ఎబి నెట్వర్క్ ) మే 21 (అఖండ భూమి న్యూస్):** మాజీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి నిన్నటి రోజున మీరు ప్రెస్ మీట్ లో జనసేన అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ ఉద్దేశిస్తూ దత్తపుత్రుడు అని సంబోధించడం చాలా బాధాకరం, అవును ఆయన ప్రజలకు దత్తపుత్రుడు, ఆపదలో ఉన్న వారికి దత్తపుత్రుడు అంతేకానీ నీలాగా కుటుంబ సభ్యులకు దొంగపుత్రుడు కాదు, 2019 నుండి 2024 వరకు నీలాగా చెత్త పాలన చేసి,రాష్ట్ర ప్రజలకు చెత్త పుత్రుడు కాదు అని తెలుసుకో 2019 నుండి 2024 వరకు రాష్ట్ర సంపదని, ప్రజాసంపదని దోచుకుని రాష్ట్రాన్ని సర్వనాశనం చేసినావు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నీ విధ్వంసపాల నుండి ఇప్పుడిప్పుడే ఆర్థిక వ్యవస్థని గాడిలోకి తెస్తున్నాయి. మరోవైపు గూగుల్ లాంటి ప్రతిష్టాత్మకమైన కంపెనీలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తెస్తూ పారిశ్రామిక రంగంలో అగ్రగాముగా నిలబెట్టే క్రమంలో పాలన సాగుతా ఉంది. మరోవైపు గత ఐదేళ్లలో రోడ్లలో గుంతలుకూ పిటికడు మన్ను కూడా వేయలేని నీ చెత్త పరిపాలనలో రాష్ట్ర ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు, నేడు కొన్ని వేల కిలోమీటర్లు రోడ్లు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వేసింది. పోలవరం, అమరావతి అభివృద్ధికి కట్టుబడి పాలన సాగుతా ఉంది. మీలాంటి కళ్ళు లేని కబోదికి ఇవన్నీ కనపడవు కేవలం కూటమి ప్రభుత్వాన్ని విమర్శించడం ధ్యేయంగా ఆధ్యాంతం నీ ప్రెస్ మీట్ జరిగింది ఇప్పటికైనా కళ్ళు తెరిచి చూడాలని నీకు తెలియజేస్తున్నాం.

## ధర్మవరంలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు



**ప్రత్తిపాడు, మే 21 (అఖండ భూమి న్యూస్):** ప్రత్తిపాడు మండలంలోని ధర్మవరం గ్రామపంచాయతీ పరిధిలో నంది బొమ్మ సెంటర్ వద్ద ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు.గ్రామ ప్రజలు, ప్రయాణికులు,ఉపాధి కూలీలు వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేలా కోలా నాగబాబు సహకారంతో ఈ చలివేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా చలివేంద్రంలో చల్లటి మజ్జిగతో పాటు ఓఆర్ఎస్ఎల్ ప్యాకెట్లను కూడా ప్రజలకు అందుబాటులో ఉంచారు.వేసవిలో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని,ప్రజలు ఎండ వేళల్లో జాగ్రత్తలు పాటించాలని నిర్వాహకులు సూచించారు.గ్రామ ప్రజలు ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ,మండుతున్న ఎండల్లో మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.ముఖ్యంగా ప్రయాణికులు, వృద్ధులు,కార్మికులకు ఈ చలివేంద్రం ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎంవిఆర్ కుమార్ బాబు,కూటమి నాయకులు బొల్లు కొండబాబు,దాసం శేషారావు,బొల్లు చిన్నోడు,ఊటా వీరబాబు,కోలా నాగబాబు,ఇందన ఏసుబాబు,తూపాటి నూకరాజు,జువ్వల బాబులు, దివాణం,పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నిరంతర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : ప్రత్తిపాటి

పట్టణంలో రూ.42 లక్షలతో వేయనున్న సీసీరోడ్లకు శంకుస్థాపన చేసిన ప్రత్తిపాటి





**చిలకలూరిపేట మే 21 (అఖండ భూమి న్యూస్):** నిరంతర అభివృద్ధే కూటమిప్రభుత్వ లక్ష్యమని, పట్టణాభివృద్ధిలో ఎక్కడా రాజీపడేది లేదని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. శుక్రవారం ఆయన పట్టణంలో నూతనంగానిర్మించే సీసీ రోడ్లకు స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. 8వ వార్డులో రైతు బజార్ వెనక రూ.17.50 లక్షలతో నిర్మించే సీసీరోడ్డుకు, 19వ వార్డులో 24.50 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేసిన అనంతరం ప్రత్తిపాటి మాట్లాడారు. వర్షాకాలం నాటికి రోడ్లు, డ్రైనేజ్ సమస్యను పూర్తిగా తొలగిస్తామని, ప్రజలు కూడా రోడ్లు, కాలువల నిర్వహణపై శ్రద్ధ పెట్టాలని ప్రత్తిపాటి సూచించారు.ఈ కార్యక్రమంలో టిడిపి సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు కొత్త కోటేశ్వరరావు, ముల్లా కరీముల్లా, మద్దిబోయిన శివ, మురకొండ మల్లిబాబు, షేక్ అబ్దుల్లా, ఏసు బాబు, సుబ్బారావు, రజాక్, రఫీ, మాజీ కౌన్సిలర్లు మౌలాలి .కొత్త కుమారి, నసీమా బేగం, మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరి, డిఇ అబ్దుల్ రహీమ్, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


## శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక ఎమ్మార్వో శ్రీనివాసులు కి వివరణ గడు పెంచవలసిందిగా మెమోరాండం సమర్పించిన తెలుగుదేశం నాయకులు



**శ్రీశైలం మే 21 (అఖండ భూమి న్యూస్):** సున్నిపెంట గ్రామం నందు నివసించు ప్రజల కు తెలుగుదేశం పార్టీ అధినాయకుల ఆదేశాలతో ఇచ్చిన నోటీసులలో ఎక్కువమంది కూలి పనులు చేసుకుని జీవనం సాగించుచున్నారు. వారు ఉదయం పని నిమిత్తం ఆరు గంటలకు వెళ్తే సాయంత్రం 6 గంటలకు అంతకుమించి గృహాలకు చేరుకుంటారు అందు వలన కొంతమంది సున్నిపెంట తహసిల్దార్ కార్యాలయం నుండి ఇచ్చిన నోటీసులకు సంజాయిషీ పత్రాలు తో వివరణ ఇవ్వలే కా పోయారు అని . అలాగే వేసవి సెలవుల కారణంగా కొంతమంది ఊర్లకు వెళ్లడం వలన సంజాయిషీ స్థానిక ఎమ్మార్వో ఆఫీసు నందు ఇవ్వలేకపోయారుఅనిఅందువలన స్థానిక ఎమ్మార్వో శ్రీనివా సులు ని .20/05/2026 తేదీన సున్నిపెంట బస్టాండ్ నందు జరిగిన బహిరంగ సభ జరిగిన సందర్భంగా ఆ సభలో శ్రీశైలం ఎమ్మెల్యే ప్రసంగిస్తూ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి స్థాని కులకు గ డువును పెంచమని కలెక్టర్ వా రిని కోరగా నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియ సమ్మతము తెలిపారు. కనుక పై విషయాలు పరిశీలించి సున్నిపెంట ప్రజలకు సంజాయిషి ఇచ్చే గడువు పెంచవలసిందిగా స్థానిక ఎమ్మార్వో శ్రీనివాసులు వారికి తేదిని 05/06/2026 వరకు పొడిగించగలరని శ్రీశైలం మండల ప్రధాన కార్యదర్శినాగేళ్ల సురేష్ స్థానిక ఎమ్మార్వో వారికి తెలుగుదేశం పార్టీ తరపున మేమరాండం సమర్పిస్తూ గడువు పెంచాలని ఆయనను కోరారు ఈ సందర్భంగా ఆయన సానుకూలంగా స్పందిస్తూ ఈ గడువు వరకు నోటీసులు అందజేసిన వారందరికీ గ దవును పొడిగిస్తామని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో సుభాని కాంట్రాక్టర్ ప్రవీణ్ తేజ, జంకె రామ సుబ్బారెడ్డి,అన్వర్ భాష జావీద్, నజీర్, గాదం మల్లేష్ మీనుగ శ్రీనివాసులు తదితర టిడిపి నాయకులు కలసిమెమొరదం సమర్పించారు రని తెలిపారు

## గిరిజనుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన "రామరాజ్యం "

ఎంపీపీ "బడుగు రమేష్" సిపిఐ జిల్లా కార్యదర్శి "పొట్టిక సత్యనారాయణ "



**కొయ్యూరు అల్లూరి జిల్లా మే 21 (అఖండ భూమి న్యూస్):** ఉద్యమాలే ఊపిరిగా పనిచేస్తూ గిరిజనుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన మహోన్నతమైన వ్యక్తి కామ్రేడ్ స్వర్గీయ బడుగు రామరాజ్యమని ఎంపీపీ బడుగు రమేష్, భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండలంలో కించవానిపాలెంలో స్వర్గీయ రామరాజ్యం 10వ వర్ధంతి వేడుకలు కుటుంబ సభ్యులు భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎంపీపీ బడుగు రమేష్, అల్లూరి జిల్లా సిపిఐ కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై చదువుతున్న కాలము నుండి గల మెత్తుతూ అంచలంచెలుగా ఎదిగారన్నారు. వైస్ ఎంపీపీ గా ఎంపీపీగా పనిచేసే ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచారని గుర్తు చేశారు. గిరిజనులకు ఎటువంటి సమస్య ఏర్పడిన ముందుగా గుర్తొచ్చేది రామరాజ్యమేని అన్నారు. అప్పట్లో మావోయిస్టులు ప్రభావంతో అనేకమంది గిరిజనులపై పోలీసులు వేధింపులకు గురి చేసేటప్పుడు తానున్నానంటూ ముందుకొచ్చి ఆదివాసీలకు అండగా నిలిచేవారని గుర్తు చేశారు. అలాగే వివిధ గ్రామాల్లో స్వర్గీయ చింతపల్లి మాజీ ఎమ్మెల్యే గొడ్డేటి దేవుడు అండదండలతో అభివృద్ధి పనులు చేశారన్నారు. అనంతరం వివిధ గ్రామాల నుండి తరలివచ్చిన అభిమానులకు పార్టీ కార్యకర్తలకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల సిపిఐ పార్టీ కార్యదర్శి ఉల్లి సూరిబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఇరవాడ దేముడు, చీడి పాలెం మాజీ సర్పంచ్ నత్తూరు సోమన్న దొర, నాగరాజు మాదల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

# చేస్తున్న మంచి... సాధించిన ప్రగతిని ప్రజల మనసుల్లో నాటుకుపోయేలా చేయండి : ప్రత్తిపాటి

ప్రత్యక్ష మహానాడుకు తీసిపోని విధంగా హైబ్రిడ్ మహానాడు విజయవంతం కావాలి.

సూపర్ 6 పథకాలతో పాటు.. మన నాయకత్వం సాధించిన పెట్టుబడులు. వచ్చిన పరిశ్రమలపై ప్రజలకు అవగాహన కల్పించండి.

ముఖ్యమంత్రి చంద్రబాబు మహానాడు సందేశం.. లోకేశ్ ప్రసంగంపై ప్రజల్లో చర్చ జరిగేలా చూడండి.

క్లస్టర్ ఇన్ ఛార్జులు, టీడీపీ నాయకులకు ప్రత్తిపాటి దిశానిర్దేశం.



**చిలకలూరిపేట మే 22( అఖండ భూమి న్యూస్):** అధికారంలోకి వచ్చినప్పటినుంచి చేసిన మంచి, సాధించిన ప్రగతిని ప్రజల మనసుల్లో నాటుకుపోయేలా చేయాలని, కేవలం రెండేళ్లలోనే రెండు దశాబ్దాల అభివృద్ధిని చంద్రబాబు నాయకత్వంలోని కూటమిప్రభుత్వం రాష్ట్రానికి అందించిందనే సత్యం ప్రతి ఒక్కరికీ తెలియాలని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు.శుక్రవారం ఆయన స్థానిక క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ క్లస్టర్ ఇన్ ఛార్జులు, టీడీపీ ప్రధాన నాయకులతో హైబ్రిడ్ మహానాడు విజయవంతంపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా తలెత్తిన ఆర్థిక సంక్షోభాన్ని గమనించి, ప్రధాని మోదీ సూచించిన విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో పొదుపు చర్యలకు శ్రీకారం చుట్టారని ప్రత్తిపాటి చెప్పారు. దేశ హితం కోసమే టీడీపీ అధినాయకత్వం త్వరలో నిర్వహించే మహానాడును వర్చువల్ గా నిర్వహించాలని నిర్ణయించిందన్నారు. ఎలాంటి హంగులు, ఆర్భాటాలు లేకపోయినా.. మహానాడు నిర్వహణ ఉత్సాహానికి ఏమాత్రం తీసిపోని విధంగానే టీడీపీ శ్రేణులు ప్రజలకు తమ సందేశాన్ని అందించాలన్నారు. వర్చువల్ మహానాడు వీక్షణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని, కార్యక్రమానికి హాజరయ్యే టీడీపీ అభిమానులు, కార్యర్తలతో పాటు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ప్రత్తిపాటి స్థానిక నాయకుల్ని ఆదేశించారు. రెండు రోజులకు సరిపడా వసతి, భోజన ఏర్పాట్లలో ఎలాంటి లోపం లేకుండా చూడాలన్నారు. పట్టణంతో పాటు.. మండల కేంద్రాలు, గ్రామ పార్టీ కార్యాలయాల వద్ద భారీ ఎల్ ఈడీ స్క్రీన్స్ ఏర్పాటు చేసి, ప్రజలు మహానాడు వీక్షించేలా చూడాలన్నారు. టీడీపీ అధినేత. మన నాయకుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు సందేశం, లోకేశ్ ప్రసంగంపై ప్రజల అలోచనలు, అభిప్రాయాల్ని కేడర్ తెలుసుకోవాలని ప్రత్తిపాటి సూచించారు. సూపర్ 6 హామీల అమలుతోపాటు.. 23 నెలల్లో రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు. చంద్రబాబు, లోకేశ్ లు శ్రమించి తీసుకొచ్చిన జాతీయ అంతర్జాతీయ సంస్థలు. వాటివల్ల కలిగే ప్రయోజనాల్ని ప్రజలకు, ముఖ్యంగా యువతకు వివరించాల్సిన బాధ్యత క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్ ఛార్జులపైనే ఉందని ప్రత్తిపాటి స్పష్టం చేశారు.సమావేశంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, పట్టణ అధ్యక్షులు, మండల అధ్యక్షులు జవ్వాజి మదన్ మోహన్, కామినేని సాయిబాబు, క్లస్టర్ ఇంచార్జీలు, పట్టణ, మండల, వివిధ హోదాలలో ఉన్న నాయకులు, పాల్గొన్నారు.

# రాష్ట్రంలో చిచ్చు పెట్టి.. ప్రజల్ని రెచ్చగొట్టడమే జగన్ లక్ష్యం : ప్రత్తిపాటి

జగన్ గంటలు గంటల ప్రెస్ మీట్లతో తమకు, రాష్ట్రానికి ఏం ఉపయోగమని ప్రజలే ప్రశ్నిస్తున్నారు.

ఐదేళ్లు సాగించిన విధ్వంసం..దోపిడీ...అరాచకంతో ప్రజలు మళ్లీ జగన్ ను నమ్ముతారా?

మళ్లీ అధికారంలోకి వస్తామనే మత్తు నుంచి జగన్.. వైసీపీనేతలు బయటపడాలి.

పట్టణంలోని ఆక్రమణలపై ప్రజల నుంచి ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయి.

ప్రజల కోరిక మేరకే ఆక్రమణలు తొలగించి, రోడ్లను వెడల్పు చేయాలని నిర్ణయించాం.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) నిర్వహించి, మీడియాతో మాట్లాడిన ప్రత్తిపాటి.





**ప్రజల కోరిక మేరకే ఆక్రమణల తొలగింపు...**

**చిలకలూరిపేట మే 22 (అఖండ భూమి న్యూస్):** ప్రశాంతమైన రాష్ట్రంలో, ప్రజలకోసం పనిచేస్తున్న కూటమి పార్టీల్లో ఏదోఒక చిచ్చు పెట్టి. ప్రజల్ని రెచ్చగొట్టి తన కుటిల రాజకీయాలు అమలు చేయాలన్నదే జగన్ ప్రధాన లక్ష్యమని, ఆయన నిర్వహిస్తున్న సుదీర్ఘ ప్రెస్ మీట్లతో ఎవరికి ఏం ఉపయోగమని ప్రజలే అసహనం వ్యక్తం చేస్తున్నారని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక క్యాంపు కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) నిర్వహించి, ప్రజల నుంచి వినతులు స్వీకరించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు.

**మళ్లీ అధికారంలోకి వస్తామనే మత్తునుంచి జగన్..**

గంటలు.. గంటలు ప్రెస్ మీట్లు పెట్టి, నిరాధార ఆరోపణలు.. అవాస్తవాలతో ప్రజల దృష్టి మళ్లించి, తన రాజకీయ ప్రయోజనాలు నెరవేర్చుకోవాలనే ధోరణిలో జగన్ ఉన్నాడని, ఆయన.. వైసీపీనేతలు మళ్లీ అధికారంలోకి వస్తామని మత్తునుంచి బయటపడాలని ప్రత్తిపాటి సూచించారు. చంద్రబాబు పనితీరు, లోకేశ్ సమర్థతతో రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులు, జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే జగన్ ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నాడన్నారు. పెట్టుబడులు తీసుకొచ్చి, అభివృద్ధి చేయడం చేతగాని జగన్ రెడ్డి.. కూటమిప్రభుత్వ పనితీరుతో నిద్రలేని రాత్రుల్లు గడుపుతున్నాడన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అనుభవం.. దూరదృష్టి.. విశ్వసనీయతలపై ప్రజలకున్న నమ్మకం ఎప్పటికీ చెక్కుచెదరదనే వాస్తవాన్ని జగన్ గ్రహించాలన్నారు. ఐదేళ్లపాటు జగన్ విధ్వంసం, అరాచకం, దోపిడీలు చూసిన ప్రజలు.. మళ్లీ ఆయన్ని గెలిపిస్తారనుకోవడం భ్రమేనని, పెయిడ్ ఆర్టిస్టులు..మేథావుల ముసుగులోని కొందరితో ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేయాలన్న దుర్మార్గపు ఆలోచనల్లో జగన్ ఉన్నాడన్నారు. జగన్ లాంటి నాయకుడు. వైసీపీ వంటి పార్టీ రాష్ట్రంలో ఉండటం నిజంగా ప్రజల దురదృష్టమని ప్రత్తిపాటి వ్యాఖ్యానించారు. వారానికోసారి రాష్ట్రానికి వచ్చి ప్రెస్ మీట్ల పేరుతో ప్రజల్ని గందరగోళపరచాలన్న జగన్ పాచికలు పారవన్నారు.

పట్టణంతో పాటు.. ప్రధాన రోడ్ల వెంబడి ఉన్న ఆక్రమణలతో తమకు ఇబ్బందులు కలుగుతున్నాయని ప్రజల నుంచి ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నందున, ఆక్రమణలు తొలగించాలని నిర్ణయించినట్టు ప్రత్తిపాటి చెప్పారు. గ్రీవెన్స్ లో కొందరు స్థానికులు తన దృష్టికి తీసుకొచ్చిన ఆక్రమణల సమస్యపై ప్రత్తిపాటి స్పందించారు. కృష్ణారెడ్డి డొంక, పసుమర్రు-కొత్త బైపాస్ మార్గంలో ఉన్న ఆక్రమణలు తొలగిస్తామన్నారు. అదేవిధంగా ప్రభుత్వ స్థలాలు, ఇతర భూముల్ని కూడా ఆక్రమణదారులు నుంచి విడిపిస్తామన్నారు. ప్రజలు ఎంత ఇల్లు కట్టినా.. మెట్లు, అరుగులు వంటివి రోడ్లు, కాలువలపై నిర్మిస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని ప్రత్తిపాటి స్పష్టంచేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, మండల అధ్యక్షులు జవ్వాజి మదన్ మోహన్, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు మద్దిబోయిన శివ, మురకొండ మల్లిబాబు, ముల్లా కరీముల్లా, కొత్త కోటేశ్వరరావు, బేరింగ్ మౌలాలి, జంగా వినాయకరావు, షేక్ మస్తాన్ వలి, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా విద్యాశాఖ అధికారిని ఘనంగా సన్మానించిన :ఎస్టీయూలి

మార్కాపురం జిల్లా అధ్యక్షా,ప్రధాన కార్యదర్శి



**మే 22 (అఖండ భూమి న్యూస్):** నూతనంగా పదవి బాధ్యతలు స్వీకరించిన మార్కాపురం జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీ సామ సుబ్బారావు ని మార్కాపురం జిల్లా ఎస్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.కె.యస్ . ప్రసాద్, ఆర్. దేశా నాయక్ సారథ్యంలో రాష్ట్ర, జిల్లా మరియు మండల ఎస్టీయూ బాధ్యులు మర్యాద పూర్వకంగా కలిసి దుశ్శాలువ, బొకే తో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ఉపాధ్యాయవాణి కన్వీనర్ షేక్ యూసఫ్ షరీఫ్, కొమరోలు మండల అధ్యక్షులు పి రామ్ ప్రసాద్, తర్లుపాడు మండల అధ్యక్ష, ప్రధాన మరియు ఆర్థిక కార్యదర్శులు కె. వి. జగన్ బాబు, నజీర్ అహ్మద్, అంజనీ కుమార్, కార్యవర్గ సభ్యులు సిహెచ్ శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, హనుమంతరావు, అబ్దుల్ సుకూర్, ఆదినారాయణ, బొప్పరాజు శ్రీనివాసులు, రాజా రమేష్, ఎన్ ప్రసాద్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## శ్రీశైలంలో అంకాళమ్మ వారికి విశేష పూజలు



**శ్రీశైలం మే 22 (అఖండ భూమి న్యూస్):** లోకకల్యాణం కోసం శ్రీశైలక్షేత్ర గ్రామదేవత అయిన శ్రీ అంకాళమ్మవారికి అభిషేకం, విశేష పూజలను నిర్వహించడం జరిగింది. ప్రతీ శుక్రవారం రోజున శ్రీఅంకాళమ్మవారికి దేవస్థానంసేవగా (సర్కారిసేవగా) ఈ విశేషపూజ జరిపించబడుతోంది. ఇందులో భాగంగా శ్రీఅంకాళమ్మవారికి అభిషేకం, విశేషఅర్చనలు, పుష్పాలంకరణ, కుంకుమార్చనలు జరిపించబడ్డాయి. కాగా శ్రీశైల క్షేత్రానికి గ్రామదేవతగా చెప్పబడుతున్న అంకాళమ్మ ఆలయం, ప్రధాన ఆలయానికి ఎదురుగాగల రహదారికి చివరలో కుడివైపున ఉత్తరముఖంగా ఉంది. ప్రకృతి శక్తుల యొక్క కళలే గ్రామ దేవతలని దేవీభాగవతంలో చెప్పబడింది. కాగా ఈ ప్రకృతి అంతా ఆదిపరాశక్తి స్వరూపమేనని మన ఆర్షవాఙ్మయం చెబుతోంది. చతుర్భుజాలను కలిగిన ఈ దేవి నాలుగు చేతులలో కుడివైపున క్రింది నుండి పైకి వరుసగా కత్తి, సర్పంలో చుట్టబడిన డమరుకం ఉండగా, ఎడమవైపున పానపాత్ర, త్రిశూలం ఉన్నాయి. కిరీట మకుటం గల ఈ దేవి వస్త్రాలంకృతురాలైనా కర్ణాభరణాలను, కంఠాభరణాలను కలిగి ఉంటుంది. కాగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతిపూజ జరిపించబడింది. ఆ తరువాత లోకకల్యాణాన్నికాంక్షిస్తూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. అనంతరం పంచామృతాభిషేకం, హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, పుష్పోదకం, జలముతో విశేషఅభిషేకం అర్చనలు నిర్వహించబడ్డాయి.

## శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారికి విశేష అభిషేకం



**శ్రీశైలం మే 22 (అఖండ భూమి న్యూస్):** లోకకల్యాణం కోసం షష్ఠిని పురస్కరించుకుని దేవస్థానం ఆలయప్రాంగణంలోని శ్రీసుబ్రహ్మణ్యస్వామి కుమారస్వామి వారికి విశేష పూజలను నిర్వహించడం జరిగింది. ప్రతి మంగళవారం మరియు కృత్తికానక్షత్రం, షష్ఠి తిథి రోజులలో శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వారికి ఈ విశేషఅభిషేకం మరియు పూజాదికాలు దేవస్థానంసేవగా (సర్కారిసేవగా) నిర్వహించబడుతున్నాయి. కుమారస్వామివారికి పూజలు జరపడం వలన లోకకల్యాణమే కాకుండా ప్రతి ఒక్కరికి ఉద్యోగ, వ్యాపార, వ్యవహారాలలో ఆటుపోట్లు తొలగి ఆయా పనులు సక్రమంగా జరుగుతాయి. సుబ్రహ్మణ్యస్వామి అనుగ్రహంతో శత్రుబాధలు, గ్రహపీడలు, దృష్టి దోషాలు మొదలైనవి తొలగిపోతాయి. అలాగే సంతానం కోసం పూజించేవారికి తప్పక సంతానభాగ్యం లభిస్తుందని చెప్పబడుతోంది. ఈ అభిషేకానికి ముందుగా దేశం శాంతిసౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతివైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడి సమృద్ధిగా ఉండాలని, జనులకు ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాలమరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, జనులందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతిపూజ జరిపించబడింది. అనంతరం శ్రీసుబ్రహ్మణ్యస్వామివారికి అభిషేకము, అర్చన తరువాత సుబ్రహ్మణ్యస్తోత్ర పారాయణలు చేయబడ్డాయి. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలైన పాలు,పెరుగు,తేనె,నెయ్యి, కొబ్బరి నీళ్ళు మరియు వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ముఖ్యంగా వివిధ పండ్ల రసాలతో చేసే అభిషేకంతో ఎంతో ఫలితం ఉంటుందని ఆగమాలు చెబుతున్నాయి.

## కిషోరి వికాసం



**త్రిపురాంతకం మే 21 (అఖండ భూమి న్యూస్):** త్రిపురాంతకం మండలంలోని ఎందూరు వారి పాలెం అంగన్వాడి సెంటర్ నందు కిషోర్ బాలికల ఆరోగ్యం భవిష్యత్తులో డబ్బులు ఎలా పొదుపుచేసుకోవాలో వాటి గురించి మేడపి సెక్టారు అంగన్వాడి సూపర్వైజర్ దేవి వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా దేవి మాట్లాడుతూ కిషోర్ బాలికల ఆరోగ్యం గురించి బాడ్ టచ్ అంటే ఏమిటి గుడ్ టచ్ అంటే ఏమిటి భవిష్యత్తులో డబ్బులు ఎలా పొదుపు చేసుకోవాలి వివరించారు. అలాగే కిషోర్ బాలికలను వారి తల్లిదండ్రులను గ్రామ పెద్దల సమక్షంలో పిల్లల తల్లిదండ్రులు కూడా పిల్లల ప్రవర్తన పట్ల వారు ఏం చేస్తున్నా రో గమనించాలి అని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ఏఎన్ఎం అంగన్వాడీ టీచర్లు అయినటువంటి గాయత్రి స్వర్ణకుమారి హాజరయ్యారు.

అఖండ భూమి

శనివారం 23-05-2026

# కిషోరీ వికాసం: ఆర్థిక నిర్వహణపై అవగాహన సదస్సు విజయవంతం... సిడిపిఓ పూర్ణిమ





**జగ్గంపేట, కాకినాడ జిల్లా, మే 21 (అఖండ భూమి న్యూస్):** జగ్గంపేట సంత మార్కెట్ వద్ద గల సచివాలయంలో 'కిషోరీ వికాసం' కార్యక్రమంలో భాగంగా బాలికలకు ఆర్థిక నిర్వహణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఐసిడిఎస్, సీడీపీఓ పూర్ణిమ, వెలుగు జగ్గంపేట మండలం ఏపీఎం ఉమామహేశ్వర రావు పాల్గొని ప్రసంగించారు.

ముఖ్యాంశాలు:

డబ్బు వినియోగం: డబ్బు అనేది జీవితానికి ఒక సాధనం మాత్రమే, అంతిమ లక్ష్యం కాదని వివరించారు. దానిని తెలివిగా, ఆలోచించి ఖర్చు చేయాలని సూచించారు. ఈ రోజు చేసే చిన్న పొదుపు రేపటికి గొప్ప ఆసరాగా నిలుస్తుందని తెలిపారు.

తెలివైన నిర్ణయం: తెలివైన బాలికలు తమ సొమ్ము ఎక్కడికి వెళ్తుందో ఎప్పటికప్పుడు గమనిస్తారని పేర్కొన్నారు. ఖర్చు చేసే ముందు ఒకసారి ఆలోచించడం అలవాటు చేసుకోవాలని హితవు పలికారు.

పొదుపు అలవాట్లు: వేసవి శిక్షణ అనంతరం ప్రతి ఒక్కరూ 'చిన్నారుల బ్యాంకు' లేదా తపాలా కార్యాలయంలో పొదుపు ఖాతా ప్రారంభించాలని కోరారు. వారపు ఖర్చుల ప్రణాళిక తయారు చేసుకోవాలని, రోజువారీ ఖర్చులను చిన్న దినచర్య పుస్తకంలో నమోదు చేసుకోవాలని సూచించారు.

కుటుంబ చర్చ: డబ్బు నిర్వహణపై కుటుంబ సభ్యులతో చర్చించాలని, నేర్చుకున్న అంశాలను బంధుమిత్రులకు తెలియజేయాలని పిలుపునిచ్చారు.

వేసవి జాగ్రత్తలు: వేసవి తీవ్రత దృష్ట్యా అందరూ అధికంగా మంచినీరు, మజ్జిగ తీసుకోవాలని సూచించారు. నీరు కలిపిన ఉప్పు పొడి, చక్కెర ద్రావణం వంటివి అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ఎండ తీవ్రత నుంచి రక్షణ కోసం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అవసరమైతే తప్ప ఇంటి నుంచి బయటకు రావద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసులు, వి.ఓ.ఏ, ఎం.ఎల్.హెచ్.పి, ఏ.ఎన్.ఎం, ఆశా కార్యకర్తలు, పర్యవేక్షకులు సునీత, కరీమున్నిసా, అంగన్వాడీ ఆయాలు, అధిక సంఖ్యలో బాలురు, బాలికలు పాల్గొన్నారు.

# జగ్గంపేట మండలం లో దివ్యాంగ బాలబాలికల ఎన్రోల్మెంట్ మరియు గుర్తింపు సర్వేను సందర్శించిన జిల్లా ఐ ఇ కో ఆర్డినేటర్ గిరి ప్రసాద్

**కాకినాడ జిల్లా జగ్గంపేట మే 21 (అఖండ భూమి న్యూస్):** సమగ్ర శిక్ష కాకినాడ డిఇఓ కాకినాడ వారి ఆదేశాల ప్రకారం మే 4 వ తేదీ నుండి జూన్ 10 వరకు జగ్గంపేట మండలం లో దివ్యాంగ బాల బాలికల ఎన్రోల్మెంట్ డ్రైవ్ ,గుర్తింపు సర్వే జరుగుతుంది. 0 నుండి 18 సంవత్సరాల దివ్యాంగ బాల బాలికలను దృష్టి పోర్టల్ నందు ఎక్స్ ఎల్ కనెక్ట్ యాప్ ద్వారా ఆన్లైన్ చేయడం జరుగుతుంది. జిల్లా లో 21 మండలాల్లో భవిత కేంద్రం ఉపాధ్యాయులు సర్వే నిర్వహించి బడి మధ్యలో మానేసిన పిల్లలను, ఇప్పటి వరకు ఏ స్కూల్ లో నమోదు కానీ పిల్లలను సంబంధిత ప్రభుత్వ పాఠశాలల్లో జాయిన్ చేయడం జరుగుతుంది. ఈ సందర్భంగా దివ్యాంగ బాల బాలికల తల్లితండ్రులకు భవిత కేంద్రాలలో కల్పిస్తున్న సౌకర్యాలు వివరించి జాయిన్ చేసుకోవడం జరుగుతుంది. దివ్యాంగ పిల్లల భవితకు భరోసా భవిత కేంద్రాలు భవిత కేంద్రాల్లో కల్పిస్తున్న సౌకర్యాలు స్పెషల్ ఎడ్యుకేషన్, స్పీచ్ థెరపీ, బిహేవియర్ మాడిఫికేషన్ థెరపీ,ప్రతి వారం ఫిజియోథెరపీ, ప్రతి శనివారం గృహ ఆధారిత విద్య, ప్రతి సంవత్సరం మెడికల్



అసెస్మెంట్ క్యాంపులు, చిన్నారులకు అవసరమైన ఉపకారణాల పంపిణీ, ప్రతి సంవత్సరం అలవెన్సుల( ట్రాన్స్పోర్ట్, ఎస్కార్ట్, గర్ల్స్ స్టైఫండ్, హోమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ ) రూపంలో ఆర్థిక సహాయం, సదరం సర్టిఫికెట్లు చేయించడం, యుడిఐడి కార్డులు చేయించడం, నిరామయ హెల్త్ ఇన్సూరెన్స్ చేయించడం, బస్సు పాస్ మరియు ట్రైన్ పాస్ సౌకర్యం కల్పించడం, తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇవ్వడం, ప్రభుత్వ మరియు ప్రైవేట్ ఉద్యోగాలు సాధించుటకు కృషి చేయడం, పారా అథ్లెటిక్ స్పోర్ట్స్ లో ట్రైనింగ్ ఇవ్వడం, ఆట పాటలలో ప్రత్యేక శిక్షణ ఇవ్వడం, వారికున్న నైపుణ్యాన్ని బట్టి ట్రైనింగ్ ఇవ్వడం, పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపించడం, వారికి మెరుగైన జీవితాన్ని మరియు జీవనోపాధిని కల్పించే విధంగా భవిత కేంద్రాలు పనిచేస్తాయి. భవిత కేంద్రంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు మనో ధైర్యాన్ని కల్పించి, పిల్లల పట్ల వారికున్న సమస్యలపై వివరణ ఇవ్వడం, ఈ పిల్లల పట్ల తల్లి తండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు బాధ్యతలు గురించి చెప్పడం జరుగుతుంది. ఈ కార్య క్రమం లో భవిత కేంద్రం ఉపాధ్యాయులు అప్పాన పెద్దకాపు, తిత్తి చిన్న బాబు లు పాల్గొన్నారు.

## పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు పంపిణీ నాతవరం మండలం



**మే 21 (అఖండ భూమి న్యూస్):** తాండవ చైర్మన్ కరక సత్యనారాయణ గారు మరియు మండల వ్యవసాయ అధికారి వారు సమక్షంలో రైతులకు జనుము, జీలుగ , పిల్లిపేసర,పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు మరియు జూఎంఎం విత్తనాలు కిట్లు రైతులకు అందచేయడం జరిగింది మండల వ్యవసాయ అధికారిణి జి సుగుణ గారు మాట్లాడుతూ నాతవరం మండలంలో ఎలినో ప్రభావం వలన వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రైతులు ప్రతి ఒక్కరు తప్పనిసరిగా భూమి కోర్నిగా ఉంచకుండా పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు కానీ లేదా 32 రకాల విత్తన ప్రావీణా కిట్స్ రానున్న తొలకరి వర్షాలు ఉపయోగించుకుని వెయ్యాలి అని తెలియజేశారు. ఈ విధంగా నేలను పంట తో కప్పి ఉంచడం ద్వారా నేల, నీరు సంరక్షణ జరుగును. ఈ విధంగా పచ్చిరొట్ట ఎరువులు సాగు చేసి కలియ దున్నడం వలన రసాయనిక ఎరువులు వాడకం తగ్గించి ఆరోగ్యకరమయిన పంట ఉత్పత్తి నీ పొందవచ్చును. ఈ విత్తనాలు ప్రతి రైతు సేవ కేంద్రం నందు అందుబాటులో ఉంటాయని రైతులు తప్పనిసరిగా వినియోగించుకోవాలి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్కే సిబ్బంది , ఏపీ సీ ఎన్ అఫ్ సిబ్బంది , మరియు రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది .

## ప్రజల సమస్యలు తెలుసుకున్న ఎరిక్షన్ బాబు

**యర్రగొండపాలెం మే 21 (అఖండ భూమి న్యూస్):** యర్రగొండపా లెంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో




అందజేశారు. అందులో కొన్ని సమస్యలను అధికారులతో మాట్లాడి వెంటనే పరి ష్కరించగా, మిగిలిన సమస్యలను త్వరితగతిన పరిష్క రించాలని ఎరిక్షన్ బాబు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు తెలుసుకొని పరిష్కరించేలా కూటమి ప్రభుత్వం, ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు కట్టుబడి ఉన్నారని, ప్రజ ల వద్దకే పాలన అనే ఉద్దేశంతో నియోజకవర్గ స్థాయిలో కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అభివృద్ధి, ప్రజా సంక్షేమంలో కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మెన్ చేకూరి సుబ్బారావు, మండల టీడీపీ అధ్యక్షులు చిట్యాల వెంగళరెడ్డి, జెడ్డా రవి, మైనార్టీ నాయకులు షేక్ ఇస్మాయిల్, కాకర్ల కోటయ్య,కంచర్ల సత్యనారాయణ గౌడ్, కందుల నారాయణరెడ్డి, రమణారెడ్డి,మస్తాన్ వలి, తెలుగు యువత నాయకులు షేక్ చిన్న వలి, పాస్టర్ జీవయ్య పాల్గొన్నారు.

## కాపునాడు తాడిమర్రి మండల అధ్యక్షునిగా కాడిశెట్టి ఇంద్ర కుమార్



**అనంతపురం ( ఎబి నెట్వర్క్ ) మే 21 (అఖండ భూమి న్యూస్):** కాపునాడు తాడిమర్రి మండల అధ్యక్షునిగా కాడిశెట్టి ఇంద్ర కుమార్ ను నియమిస్తూ కాపునాడు జిల్లా అధ్యక్షుడు ఇటికింటి మహేష్ గారు కాపునాడు రాయలసీమ అధ్యక్షులు పూల పాండురంగయ్య ప్రకటించారు. ఈ సందర్భంగా కాడిశెట్టి ఇంద్ర కుమార్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బలిజలకు అధిక సీట్లకు కృషి చేస్తానని వారందరి గెలిపించుకుంటామని శ్రీకృష్ణదేవరాయల జయంతి ప్రభుత్వం నిర్వహించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని పేద విద్యార్థుల చదువు కోసం ఆదుకుంటామని బలిజల అభివృద్ధికి నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. నా ఎన్నికకు సహకరించిన తాడిమర్రి బలిజ బాంధవులకు కృతజ్ఞతలు తెలిపారు.

## క్రీస్తు లూథరన్ దేవాలయంలో చిల్డ్రన్ బైబిల్ క్లబ్.

పాస్టర్ రెవరెండ్ వై ప్రభాకర్ రావు

**మాచవరం మే 21 (అఖండ భూమి న్యూస్):** క్రీస్తులూథరన్ దేవాలయం మాచవరంలో శుక్రవారం చిల్డ్రన్ బైబిల్ క్లబ్ నిర్వహించడం జరిగింది. సండే స్కూల్ యూత్ పిల్లలు పాల్గొన్నారు. మూడు రోజులు వాక్యాలు చెప్పడం. కంఠస్థ వాక్యాలు. సాంగ్స్ నేర్చుకున్నారు. బైబిల్లోని కథలు ఈ వేసవి కాలంలో




పిల్లలు దేవుని మార్గంలో ఉండాలని పాస్టర్ రెవరెండ్ ప్రభాకర్రావు తెలియజేశారు. ఈ మూడు రోజులు స్నాక్స్ భోజనం గిఫ్ట్ పిల్లలకు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాగిడి నరేష్ ,. మల్లేశ్వరి డెలిగేట్ రాగిడి చిన్న సైదులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం పిల్లలకు ఆత్మీయంగా దేవుని మార్గం వైపు నడిపించేదిగా ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ రెవరెండ్ వై ప్రభాకర్ రావు , పాస్టర్స్ సోనీ సంఘ పెద్దలు పాల్గొన్నారు

## వైద్యశాలల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు డాక్టర్లు అందుబాటులో ఉండాలి. ఎంపీపీ కొక్కెర అంజమ్మ



**మాచవరం మే 21 (అఖండ భూమి న్యూస్):** ప్రస్తుతం వేసవి తీవ్రత ఎక్కువగా ఉందని ప్రజలు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ప్రభుత్వ వైద్యశాలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు మరియు డాక్టర్లు అందుబాటులో ఉండాలని ఎంపీపీ కొక్కెర అంజమ్మ అన్నారు. శుక్రవారం మాచవరం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఎంపీపీ అంజమ్మ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి అందరూ సహకరించాలని త్రాగునీటి యద్దన లేకుండా ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించాలన్నారు. ఆయా గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులను పంచాయతీరాజ్ ఏఈ నాగేశ్వరరావు వివరించారు అలాగే ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో కూలీలకు పందులను కల్పిస్తున్నామని వారికి మెరుగైన వసతులు కల్పిస్తున్నామని ఉపాధి ఏపీవో కోటిరెడ్డి వివరించారు అలాగే ఆర్డీఎఫ్ అధికారులు నీటి సమస్యలు ఏమైనా నేరుగా పంచాయతీకి గాని ఆర్డబ్ల్యూఎస్ అధికారులకు గాని తెలియజేయాలని కోరారు పలు గ్రామాల ఎంపీటీసీలు వారి సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు ఈ కార్యక్రమాల్లో ఎంపీడీవో కార్యాలయం సూపర్నెంట్ ప్రసాద్ పలు గ్రామాల ఎంపీటీసీలు ప్రభుత్వ శాఖల అధికారులు కూటమి నాయకులు పాల్గొన్నారు

## ఘనంగా ప్రపంచ ప్రియాక్లాంప్సియా దినోత్సవం

గర్భిణీ స్త్రీలకు,వైద్య సిబ్బందికి ప్రత్యేక అవగాహన సదస్సు




**యర్రగొండపాలెం మే 21 (అఖండ భూమి న్యూస్):** ప్రపంచ ప్రియాక్లాంప్సియా దినోత్సవం పురస్కరించుకుని పట్టణంలోని స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్యశాల మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ దేవర యదిద్య అధ్యక్షతన శుక్రవారం గర్భిణీ స్త్రీలకు,వైద్య సిబ్బందికి ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ సూపరింటెండెంట్ యదిద్య మాట్లాడుతూ,గర్భధారణ సమయంలో 20వ వారం తర్వాత అకస్మాత్తుగా వచ్చే అధిక రక్తపోటు,మూత్రంలో ప్రోటీన్ పోవడాన్ని 'ప్రియాక్లాంప్సియా,అంటారని వివరించారు.సరైన సమయంలో దీనిని గుర్తించకపోతే తల్లి కిడ్నీలు,లివర్,మెదడు దెబ్బతినడమే కాకుండా, ఫిట్స్ వచ్చి ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉందని తెలిపారు.తీవ్రమైన తలనొప్పి,కంటిచూపు మసకబారడం,ముఖం,చేతులు,కాళ్ళలో అకస్మాత్తుగా విపరీతమైన వాపులు రావడం,కుడివైపు పక్కటెముకల క్రింద కడుపునొప్పి,మూత్రం తగ్గిపోవడం లాంటి లక్షణాలు కనిపిస్తే,ముఖ్యంగా గర్భిణులకు ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రిని సంప్రదించాలని కోరారు.అలాగే గతంలో బీపీ,మధుమేహం,కిడ్నీ సమస్యలు ఉన్న హై-రిస్క్ గర్భిణీలను మొదటి త్రైమాసికంలోనే గుర్తించి,వైద్యుల సలహా మేరకు 12 నుండి 16 వారాల లోపు లో-డోస్ ఆస్పిరిన్ మందులు ప్రారంభించడం ద్వారా ఈ ప్రమాదాన్ని 60 శాతం వరకు నివారించవచ్చని తెలిపారు.ఆసుపత్రిలో గర్భిణీ తల్లులకు నిరంతరం నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి తమ సిబ్బంది కట్టుబడి ఉన్నామని,తల్లులు కూడా తమ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండి,క్రమం తప్పకుండా ప్రసవ పూర్వ పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐటీడీఏ డిప్యూటీ డిఎంహెచ్ఓ తోకల రవి,ఆసుపత్రి వైద్యులు సుభాషిని,వెంకయ్య, చైతన్య సుధా,యోమీమా, ముబీన,విజయ, డాక్టర్ సుబ్రహ్మ,నర్సింగ్ సిబ్బంది,ఆశా కార్యకర్తలు,గర్భిణీ స్త్రీలు పాల్గొన్నారు.

## ఎంపీపీ గొల్లపల్లి బుజ్జిని మర్యాదపూర్వకంగా కలిసిన జె అన్నవరం పిహెచ్సి డాక్టర్ జయరామ్



**ఏలేశ్వరం, మే 21 (అఖండ భూమి న్యూస్):** ఏలేశ్వరం మండలం జె అన్నవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రెగ్యులర్ డాక్టర్గా బత్తుల జయరామ్ ని ప్రభుత్వం నియమించిన నేపథ్యంలో ఏలేశ్వరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రధాన లక్ష్యంగా పని చేయాలని సూచించారు.గ్రామీణ ప్రాంత ప్రజలకు సకాలంలో వైద్యం అందేలా డాక్టర్ మరియు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు,చిన్నారులు,వృద్ధులకు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని సూచించారు.అలాగే మందుల కొరత లేకుండా చూసుకోవడం,ప్రతి రోజు ఓపీ సేవలు నిరంతరంగా కొనసాగించడం,అత్యవసర కేసులను తక్షణమే ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి సరైన రిఫరల్ సిస్టమ్ ద్వారా ఉన్నత వైద్య కేంద్రాలకు పంపించడం అవసరమని పేర్కొన్నారు.

## జొన్నాడ రెల్లిబాడవ గండి పూడ్చి, గోడ నిర్మాణం చేపట్టిన చింతలూరు నీటి సంఘం అధ్యక్షుడు గారపాటి





**ఆలమూరు,మే 22(అఖండ భూమి న్యూస్):** వెయ్యి ఎకరాలకు సాగునీరు అందించే ఆలమూరు, పెదపళ్ల, పినపళ్ల, చింతలూరు, సంధిపూడి పొలాలకు సాగు నీరు అందించే కొత్తకాలువకు ( రెల్లిబాడవ) గండి పూడ్చి, తూరలు ఏర్పాటు చేసి, గోడ కట్టే పనులను చింతలూరు నీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాస్ శుక్రవారం స్వయంగా దగ్గరుండి చేపట్టారు. 10 సంవత్సరాల నుంచి ఈ కాలువకు జొన్నాడ వద్ద గండిపడి ఉందన్నారు. ఇసుక బస్తాలు మొదలైనవి వేసి ప్రతీ సంవత్సరం తాత్కాలికంగా మరమ్మతులు చేస్తున్నామని, రైతులకు ఇచ్చిన హామీ మేరకు తన స్వంత ఖర్చులతో ఈ నిర్మాణ పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. నిధుల కొరత ఉన్నా రైతులకు ఉపయోగపడే పనులను ఆపకుండా చేయమని కొత్తపేట జనసేన ఇన్చార్జ్ బండారు శ్రీనివాస్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదేశించినట్లు తెలిపారు. వెయ్యి ఎకరాలకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చేసే ఈ పనులను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు అందించనున్నట్లు గారపాటి తెలిపారు.

## ఎరువుల నియంత్రణపై రైతులకు శిక్షణ

వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో

మండల వ్యవసాయ అధికారి" పి శివరాం ప్రసాద్ "



**కొయ్యూరు అల్లూరి జిల్లా మే 21 (అఖండ భూమి న్యూస్):** రైతులు పండించే పంటలు ప్రకృతి వ్యవసాయం ద్వారానే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి పి శివరాం ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం నల్గొండ గ్రామంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమ నిర్వహించారు ఈ సందర్భంగా ఏవో శివరాం ప్రసాద్ మాట్లాడుతూ వ్యవసాయ రైతులు వర్షాకాలంలో రసాయన ఎరువులకు బదులు పచ్చరొట్ట ఎరువులు జీవన ఎరువులు సేంద్రియ ఎరువులు ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక దిగుబడును పొంది రైతులు లాభాలు పొందవచ్చని వివరించారు అలాగే వ్యవసాయ ద్వారా శాఖ ద్వారా వచ్చే విత్తనాలు సబ్సిడీ పరికరాల వివరాలను రైతులకు వివరించారు. ప్రభుత్వం అందించే రాయితీలను రైతులందరూ సద్వినియోగం చేసుకొని అధిక దిగుబడును సాధించాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో కార్యదర్శి అప్పారావు ఎంపీ ఈవో సత్తిబాబు ఆత్మ ఏటీఎం మహేశ్వరి పలువురు వ్యవసాయ రైతులు పాల్గొన్నారు

## సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలోలిఘనంగా జరిగిన శ్రీ కొత్త కోట సుంకులమ్మ అమ్మవారి అధిక మాస పూజ, ఒడి బియ్యం కార్యక్రమం





**అనంతపురం (ఎబి నెట్వర్క్ ) మే 21 (అఖండ భూమి న్యూస్):** సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో 54 శుక్రవారాలు జరగనున్న ఒడిబియ్యం కార్యక్రమం పదవవారం శ్రీ కొత్త కోట సుంకులమ్మ దేవాలయంలో అమ్మవారికి ఘనంగా జరిగింది. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని లలితా సహస్రనామ పారాయణం నిమ్మకాయ , దీపాలతో పూజ ఖడ్గమాల , మణిదీప వర్ణన, కనకదార శోత్రంమొదలగు పూజలు నిర్వహించారు. అనంతరం అధిక మాస మొదటి శుక్ర వారం పురస్కరించుకొని శ్రీ కొత్త కోట సుంకులమ్మ అమ్మవారికి ఒడి బియ్యం పెట్టినారు. ఒడి బియ్యం జరగని ఇద్దరికి మహిళలకు ఓడి బియ్యం కార్యక్రమం నిర్వహించారు 54 వారాలకు ఆర్థిక సహాయాన్ని శ్రీమతి రుక్మిణి సాయి ట్రస్ట్ అధ్యక్షుడు విజయ సాయికుమార్ మాతృమూర్తి ఆర్థిక సాయం అందిస్తున్నారు అధికమాసం మొదటి శుక్రవారం అమ్మవారికి ప్రీతికరంగా 33రకాల వత్తులతో 33 దీపాలతో ప్రత్యేక హారతులు ఇచ్చినారు.ఆలయ నిర్వాకులు శాశ్వత ధర్మకర్త మనోజ్ అర్చకులు వరలక్ష్మి అమ్మ వారి కార్యక్రమాన్ని శాస్త్రోతంగా నిర్వహించినారనీ సాయి ట్రస్ట్ అధ్యక్షుడు విజయ సాయికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో లిసేవకర్త రుక్మిణి సాయి ట్రస్ట్ బృందంరాఘవేంద్ర, ఎజం. ప్రకాష్,జ్యోతి ,భువన ,పల్లవి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారులి.

## తెలుగు సాహిత్యంలోజి. యమున రాణికి డాక్టరేట్

మల్లాది వెంకటకృష్ణమూర్తి సాంఘిక నవలలపై పరిశోధన



**అనంతపురం (ఎబి నెట్వర్క్ )మే 21 (అఖండ భూమి న్యూస్):** శ్రీ సత్యసాయి ఉన్నత విద్యాసంస్థ తెలుగు సాహిత్య విభాగంలో పరిశోధన నిర్వహించిన జి. యమున రాణికి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పట్టాను ప్రదానం చేసినట్లు విశ్వవిద్యాలయ అధికారులు శుక్రవారం వెల్లడించారు. "మల్లాది వెంకటకృష్ణమూర్తి తొలి దశకం సాంఘిక నవలలు -- పాత్ర చిత్రణ" అనే అంశంపై ఆచార్య మాడిగుల ప్రఫుల్ల పర్యవేక్షణలో, డాక్టర్ మల్లా పెంచల ప్రసాద్ సహకారంతో ఆమె సమర్పించిన పరిశోధన గ్రంథాన్ని విశ్వవిద్యాలయం ఆమోదించింది. మల్లాది వెంకటకృష్ణమూర్తి రచనలలో మధ్యతరగతి జీవనం, కుటుంబ సంబంధాలు, మహిళా పాత్రల భావ ప్రపంచం, సామాజిక మార్పుల ప్రతిబింబం వంటి అంశాలను యమున రాణి తన పరిశోధనలో విశ్లేషించారు. పాత్రల నిర్మాణం, కథన శైలి, సామాజిక స్పృహను శాస్త్రీయ దృక్పథంతో అధ్యయనం చేసినట్లు అధ్యాపకులు తెలిపారు. డాక్టర్ జి. యమున రాణి గత ఏడు సంవత్సరాలుగా శ్రీ సత్యసాయి ఉన్నత విద్యాసంస్థలో సహాయ ఆచార్యురాలిగా సేవలందిస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పరిశోధనా పత్రాలు సమర్పించడంతో పాటు కవితలు, వ్యాసాలు, పుస్తకాలు రచించారు. సాహిత్య, సామాజిక రంగాల్లో ఆమె చేస్తున్న సేవలను విశ్వవిద్యాలయ అధికారులు అభినందించారు. ఈ నెల 15న వైవా పరీక్ష నిర్వహించగా, 16న విశ్వవిద్యాలయం డాక్టరేట్ను ప్రదానం చేసింది. ఈ సందర్భంగా అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, సాహితీవేత్తలు జి. యమున రాణికి అభినందనలు తెలిపారు.

## తైక్వాండో పోటీలలో విజయపరంపర కొనసాగించిన

చైతన్య ఎలీట్ విద్యార్థులను అభినందించిన మాజీ మంత్రి ప్రత్తిపాటి



**చిలకలూరిపేట మే 21 (అఖండ భూమి న్యూస్):** స్థానిక గాంధీపేట లోని చైతన్య ఎలీట్ పాఠశాల విద్యార్థులు ఈనెల 15, 16, 17 తేదీలలో తెలంగాణ రాష్ట్రంలోని గద్వాల్, బృందావన్ గార్డెన్స్ లో నిర్వహించిన 16వ ఓపెన్ తైక్వాండో జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని సబ్ జూనియర్ విభాగము నందు ఎం. ప్రణీత బంగారు పతకం, బి. భవ్యశ్రీ సబ్ జూనియర్ విభాగము నందు రజత పతకం, హనీఫా క్యాడెట్ విభాగము నందు రజత పతకం, యు.భార్గవ్ నాగసాయి సబ్ జూనియర్ విభాగము నందు కాంస్య పతకం, ఏ. గణేష్ జూనియర్ విభాగము నందు కాంస్య పతకం సాధించిన విద్యార్థులను మాజీ మంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఘనంగా సత్కరించి, వారికి శుభాకాంక్షలు తెలియచేసారు.అనంతరం ప్రత్తిపాటి మాట్లాడుతూ ఈ పోటీలలో దేశవ్యాప్తంగా 23 రాష్ట్రాల నుండి మొత్తం 2250 మంది విద్యార్థులు పాల్గొనగా, చిలకలూరిపేట పట్టణానికి చెందిన చైతన్య ఎలీట్ నుండి ఆరుగురు విద్యార్థులు విజయం సాధించడం ఆనందంగా ఉందని అన్నారు, తైక్వాండో కేవలం ఆత్మరక్షణ విద్య మాత్రమే కాదు, విద్యార్థులలో చురుకుదనాన్ని నాయకత్వ లక్షణాలను మరియు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని, ఈ విద్యలో సర్టిఫికెట్ సాధించడం ద్వారా స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగాలలో 3% రిజర్వేషన్ కల్పించబడినదని, కాబట్టి ప్రతి ఒక్కరూ ఈ విద్యను నేర్చుకోవాలని సూచించారు. పతకాలు సాధించిన విద్యార్థులకు, స్కూల్ యాజమాన్యానికి మరియు కోచ్ ఎస్. అనురాధయ్య కు ప్రత్తిపాటి పుల్లారావు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# పిడుగురాళ్లలో ఇంటర్సిటీ (ఎంప్లాయిస్ ట్రైన్) స్టాప్ ఏజ్ కు కేంద్రమంత్రి గ్రీన్ సిగ్నల్




**మాచవరం మే 21 (అఖండ భూమి న్యూస్):** పల్నాడు ప్రాంత వాసుల చిరకాల కోరిక లింగంపల్లి నుండి విజయవాడ వెళ్లే ఇంటర్సిటీ ఎంప్లాయిస్ ట్రైన్ పిడుగురాళ్ల స్టాప్ ఏజ్ కు కేంద్రమంత్రి అశ్విని వైట్ల గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇటీవల గురజాల శాసనసభ్యులు ఎరపతినేని శ్రీనివాసరావు మరియు నరసరావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు తో కలసి పిడుగురాళ్లలో ఇంటర్సిటీ స్టాప్ ఏజ్ కొరకు వీరు ఇరువురు కృషి చేశారు. వారి కృషి ఫలితమే పల్నాడు ప్రజలకు ఉద్యోగస్తులకు విద్యార్థులకు శుభ సూచకమని హర్షం వ్యక్తం చేస్తున్నారు ఈ సందర్భంగా పలనాడు ప్రజలు మరియు రైల్వే ప్రయాణికులు గురజాల ఎమ్మెల్యే ఎరపతినేని శ్రీనివాసరావు నరసరావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలకు అలాగే రైల్వే బోర్డు మెంబర్ కొంక రాధా కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు

# చింతలూరు,చిన శంకర్లపూడిలో ఉపాధి శ్రామికులకు మజ్జిగ పంపిణీ

తూము కొండబాబు,పోల్నాటి భగవాన్,మిరియాల శ్రీను ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



**ప్రత్తిపాడు, మే 21 (అఖండ భూమి న్యూస్):** ఉపాధి హామీ పథకం (విబి జీ రాం జీ) శ్రామికులకు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ఆదేశాల మేరకు ప్రత్తిపాడు మండలంలోని చింతలూరు,చిన్న శంకర్లపూడి గ్రామాల్లో మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.చింతలూరు గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకులు తూము కొండబాబు,మండల టీడీపీ సోషల్ మీడియా అధ్యక్షుడు పోల్నాటి భగవాన్ ఆధ్వర్యంలో,చిన శంకర్లపూడిలో టిడిపి సీనియర్ నాయకులు మిరియాల శ్రీను సొంత నిధులతో మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ కార్యక్రమాల్లో పంచాయతీ అభివృద్ధి అధికారి రమణ మరియు పంచాయతీ సిబ్బంది,నాయకులు జనపరెడ్డి విష్ణు,సుందరపల్లి వెంకటరమణ,జనపరెడ్డి నరేష్,నక్కా బాబ్జి,సేనాపతి చిన్నా, ఈగల అబ్బు,బూరా ముసిలి,పక్కుర్తి వీరబాబు,చిన శంకర్లపూడి గ్రామ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని శ్రామికులకు మజ్జిగ పంపిణీ చేశారు.వేసవి ఉష్ణతాపం నేపథ్యంలో ఉపాధి కార్మికులకు తాగునీటి సౌకర్యాలు కల్పించడం,ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు.

# 23వ తేదీన పిడుగురాళ్ల వైద్య కళాశాలపై అభ్యంతరాల స్వీకరణ. కలెక్టర్



**మాచవరం మే 21 (అఖండ భూమి న్యూస్):** పిడుగురాళ్ల ప్రభుత్వ వైద్య కళాశాలపై శనివారం అభ్యంతరాలను స్వీకరిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ శుక్రవారం తెలిపారు. పిడుగురాళ్ల ప్రభుత్వ వైద్య కళాశాలపై అభ్యంతరాలను గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం డి.ఆర్.సి సమావేశ మందిరంలో ఈ నెల 23వ తేదీన స్వీకరించడం జరుగుతుందన్నారు. అభ్యంతరాలు లేదా ఇతర అంశాలు ఉంటే వాటికి సంబంధించిన పూర్తి సమాచారంతో వచ్చి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన గల కమిటీకి సమర్పించవచ్చని వివరించారు.

# జిల్లాలో తీవ్రమైన వడదెబ్బ (హీట్ వేవ్) పరిస్థితులు -- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

జిల్లా స్థాయి అత్యవసర సహాయ కేంద్రం (కాల్ సెంటర్) నెంబర్: 98499 03879.

మే 23 నుండి నెల రోజుల పాటు "ఆపరేషన్ క్లీన్ స్వీప్" (మన కాకినాడ - మన బాధ్యత)

జూన్ 5 నుండి ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం

జిల్లా కలెక్టర్ ఎం ఎన్ హరేంధిర ప్రసాద్





**ప్రత్తిపాడు మే 21 (అఖండ భూమి న్యూస్):** శుక్రవారం సాయంత్రం కలెక్టరేటు వివేకానంద హాలులో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ప్రెస్ మీట్ నిర్వహించి జిల్లాలో ప్రస్తుతం నెలకొన్న హీట్ వేవ్ పరిస్థితులలో ఆరోగ్య రక్షణకు ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలు, అత్యవసర ప్రజా సమస్యల పరిష్కారానికి కలెక్టరేటులో ఏర్పాటు చేసిన ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటర్ సేవలు, ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమం ద్వారా పట్టన పారిశుద్య డ్రైవ్ ల నిర్వహణ, జిల్లాలో జూన్ 5 నుండి ప్రారంభమౌతున్న ఓటరు జాబితాల స్పెషల్ ఇంటన్సీవ్ రివిజన్ ప్రక్రియకు ప్రజా సహకారం అంశాలపై వివరించారు

# ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పలువురికి ముదునూరి పరామర్శ



**ప్రత్తిపాడు, మే 21 (అఖండ భూమి న్యూస్):** ప్రత్తిపాడు మండలం గజ్జనపూడి గ్రామానికి చెందిన వైఎస్సార్సీపీ యువ నాయకుడు గొనగాల అజయ్ తల్లి,గొర్రెల సొసైటీ అధ్యక్షురాలు శ్రీదేవి ఇటీవల కాకినాడ కుసుమ హాస్పిటల్లో శస్త్రచికిత్స చేయించుకున్న నేపథ్యంలో వారిని ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్సీపీ నాయకులు,నరసాపురం పార్లమెంటు పరిశీలకులు,ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీ కృష్ణంరాజు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.త్వరగా కోలుకోవాలని మనోధైర్యం కల్పించారు.అదే విధంగా ధర్మవరం గ్రామ సర్పంచ్ బెంతుకుర్తి సుశీల కుమారుడు అనారోగ్యంతో కాకినాడ సూర్య గ్లోబల్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న నేపథ్యంలో ఆయనను కూడా పరామర్శించారు.మెరుగైన వైద్యం అందేలా వైద్యులను సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోళ్ళ కాంతి సుధాకర్,ఎంపీటీసీ సేంద్రిపు భాస్కర్రావు,స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# కరెంటు స్తంభాలకు నష్టపరిహారం చెల్లించని మైన్స్ యాజమాన్యంపై వినతిపత్రం



**తుగ్గలి, మే 21 (అఖండ భూమి న్యూస్):** పత్తికొండ తాలూకాలోని జొన్నగిరి -- పగిడిరాయి గ్రామాల మధ్య నిర్మితమవుతున్న జియో మైసూర్ గోల్డ్ మైన్స్‌ను పరిశీలించేందుకు వచ్చిన రాష్ట్ర గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్రను భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి స్థానిక రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మైన్స్ ప్రాజెక్టు పనులలో భాగంగా రైతుల పొలాల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసినప్పటికీ, వాటికి సంబంధించిన నష్టపరిహారం ఇప్పటి వరకు పూర్తిగా చెల్లించలేదని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఒక్కో విద్యుత్ స్తంభానికి రూ.6 వేల నష్టపరిహారం అందజేస్తామని మైన్స్ యాజమాన్యం హామీ ఇచ్చినప్పటికీ, అనేక మంది రైతులకు ఇప్పటికీ ఆ మొత్తాలు అందలేదని వివరించారు. ఈ నేపథ్యంలో రైతుల తరఫున గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్రకు వినతిపత్రం సమర్పించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల ఆవేదనను శ్రద్ధగా విన్న మంత్రి, ఈ విషయాన్ని వెంటనే మైన్స్ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు చేపట్టేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ, అభివృద్ధి కార్యక్రమాలు ఎంత ముఖ్యమో రైతుల హక్కులు కూడా అంతే ముఖ్యమని అన్నారు. పరిశ్రమలు రావడం వల్ల ప్రాంత అభివృద్ధి జరుగుతుందని, అయితే రైతులకు నష్టం కలిగితే వారికి తగిన పరిహారం వెంటనే అందజేయాల్సిన బాధ్యత సంబంధిత సంస్థలపై ఉందని పేర్కొన్నారు. జొన్నగిరి గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టు ప్రాంతీయ అభివృద్ధికి దోహదపడుతున్నప్పటికీ, రైతుల సమస్యలను నిర్లక్ష్యం చేయడం సరికాదని అన్నారు. ప్రభుత్వం, మైన్స్ యాజమాన్యం రైతుల పట్ల సానుకూలంగా స్పందించి పెండింగ్‌లో ఉన్న నష్టపరిహారాన్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మంత్రి స్పందనపై రైతులు సంతృప్తి వ్యక్తం చేస్తూ, సమస్య త్వరగా పరిష్కారమవుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో తుగ్గలి మండల బీజేపీ అధ్యక్షుడు లక్ష్మన్న, కర్నూలు జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి హోసూర్ బ్రహ్మయ్య, పత్తికొండ మండల అధ్యక్షుడు కరణం నరేష్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గోవర్ధన్, రాంపల్లి రంగయ్య, పత్తికొండ ప్రధాన కార్యదర్శి వీరేష్, ఎద్దులదొడ్డి లక్ష్మణస్వామి, శ్రీనివాస్ ఆచారి, ఆదోని మార్కెట్ యార్డ్ వైస్ ప్రెసిడెంట్ విజయ్ కృష్ణ, రైతులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జొన్నగిరి గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టు రాష్ట్ర అభివృద్ధికి స్వర్ణయుగానికి నాంది: మంత్రి కొల్లు రవీంద్ర

కూటమి ప్రభుత్వ పారిశ్రామిక విధానాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు -- స్థానిక యువతకు భారీగా ఉద్యోగాలు













**తుగ్గలి, మే 21 (అఖండ భూమి న్యూస్):** ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే పారిశ్రామికంగా అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పానికి జొన్నగిరి గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టు మరో నిదర్శనమని రాష్ట్ర గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. కర్నూలు జిల్లా జొన్నగిరిలో నిర్మాణ దశలో ఉన్న ప్రతిష్టాత్మక గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టును శుక్రవారం పరిశీలించిన ఆయన, ప్రాజెక్టు పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించి పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గతంలో ఎన్నో సంవత్సరాలుగా నిర్లక్ష్యానికి గురైన ఈ ప్రాజెక్టుకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త ఊపిరి లభించిందన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పించడం, పారదర్శక పాలన అందించడం వల్లే దేశ, విదేశీ పెట్టుబడిదారులు ఆంధ్రప్రదేశ్ వైపు ఆసక్తి చూపుతున్నారని పేర్కొన్నారు. జొన్నగిరి గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టు దేశ చరిత్రలోనే తొలి ప్రైవేట్ రంగ బంగారు గని ప్రాజెక్టుగా నిలవబోతోందని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక చొరవతో అనుమతుల ప్రక్రియ వేగవంతమైందని, వచ్చే నెలలోనే వాణిజ్య ఉత్పత్తి ప్రారంభమయ్యేలా ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందన్నారు. ఈ ఏడాది 600 కిలోల బంగారం, వచ్చే ఏడాది 1500 కిలోల బంగారం ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో ప్రాజెక్టు ముందుకు సాగుతోందని వెల్లడించారు. దేశానికి అవసరమైన బంగారంలో 50 నుండి 60 శాతం వరకు భవిష్యత్తులో జొన్నగిరి నుంచే ఉత్పత్తి అయ్యే అవకాశం ఉందని చెప్పారు. దీనివల్ల బంగారం దిగుమతులపై ఆధారపడటం తగ్గి విదేశీ మారక ద్రవ్య వ్యయం గణనీయంగా తగ్గుతుందని వివరించారు.

## గత ప్రభుత్వంపై మంత్రి విమర్శలు

గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి కంటే రాజకీయ ప్రయోజనాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారని మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడంలో, పరిశ్రమలను ప్రోత్సహించడంలో గత పాలకులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. ఫలితంగా యువత ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయిందని, పారిశ్రామిక రంగానికి కొత్త దిశను చూపిస్తూ పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలు వస్తేనే యువతకు ఉద్యోగాలు, రైతులకు ఆదాయం, ప్రాంతాలకు అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.

## రైతుల ప్రయోజనాలే ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యత

భూసేకరణ విషయంలో రైతులకు ఎలాంటి అన్యాయం జరగనివ్వబోమని మంత్రి హామీ ఇచ్చారు. గ్రామసభల ఆమోదం లేకుండా ఎటువంటి నిర్ణయం తీసుకోబోమన్నారు. రైతుల హక్కులను కాపాడుతూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడమే ప్రభుత్వ విధానమని తెలిపారు. అలాగే పర్యావరణ పరిరక్షణ విషయంలో రాజీ ఉండదని స్పష్టం చేశారు. పర్యావరణ నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంత పెద్ద సంస్థ అయినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ రెండూ సమానంగా ముందుకు సాగాలని పేర్కొన్నారు.

## జొన్నగిరి దేశంలోనే ప్రముఖ గోల్డ్ హబ్‌గా మారుతుంది: ఎమ్మెల్యే కే.ఈ. శ్యామ్ కుమార్

ఈ సందర్భంగా పత్తికొండ ఎమ్మెల్యే కే.ఈ. శ్యామ్ కుమార్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా అమలవుతున్నాయని అన్నారు. ప్రజల సంక్షేమం, యువత భవిష్యత్తు, పారిశ్రామిక ప్రగతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

జొన్నగిరి గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టు ద్వారా స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది కుటుంబాలకు ఉపాధి కలుగుతుందని వివరించారు. గనుల పరిశ్రమ చుట్టూ అనేక అనుబంధ వ్యాపారాలు అభివృద్ధి చెంది స్థానిక ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఈ ప్రాజెక్టును రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడమే తప్ప ప్రజల ప్రయోజనాల కోసం పనిచేయలేదని విమర్శించారు. కానీ కూటమి ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలకు గౌరవం ఇస్తూ, పారదర్శకంగా ప్రతి ప్రాజెక్టును అమలు చేస్తోందన్నారు. జొన్నగిరి ప్రాంతానికి గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టు వరం కానుందని, దీని ద్వారా రహదారులు, విద్యుత్, తాగునీటి సదుపాయాలు, ఇతర మౌలిక వసతులు మరింత మెరుగుపడతాయని తెలిపారు. భవిష్యత్తులో జొన్నగిరి పేరు దేశవ్యాప్తంగా గోల్డ్ హబ్‌గా మారబోతోందని ధీమా వ్యక్తం చేశారు.

## స్వర్ణాంధ్ర నిర్మాణానికి మరో అడుగు

ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామికంగా దేశంలో అగ్రస్థానంలో నిలబెట్టే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని నాయకులు పేర్కొన్నారు. జొన్నగిరి గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టు విజయవంతమైతే కర్నూలు జిల్లా మాత్రమే కాకుండా మొత్తం రాయలసీమ ప్రాంత ఆర్థికాభివృద్ధికి కొత్త అవకాశాలు తెరుచుకుంటాయని అభిప్రాయపడ్డారు. త్వరలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రాజెక్టు ప్రారంభోత్సవం జరగనున్న నేపథ్యంలో జొన్నగిరి ప్రాంత ప్రజల్లో భారీ ఆశలు నెలకొన్నాయి. ఈ ప్రాజెక్టు రాష్ట్ర పారిశ్రామిక చరిత్రలో స్వర్ణాక్షరాలతో లిఖించబడే అధ్యాయంగా నిలుస్తుందని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు.

# రూరల్ సీఐ సుబ్బానాయుడు ఆధ్వర్యంలో మహిళల భద్రత పై అవగాహన సదస్సు



**చిలకలూరిపేట మే 22 (అఖండ భూమి న్యూస్):** పట్టణ పరిధిలోని శారద హైస్కూల్ లో మహిళల భద్రత అవగాహన సదస్సు ను చిలకలూరిపేట రూరల్ సీఐ. బి. సుబ్బా నాయుడు మరియు చిలకలూరిపేట రూరల్ పోలీస్ స్టేషన్ డబ్ల్యూ.ఎస్.ఐ. అయిన కె. లేఖ ప్రియాంక ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమములో రూరల్ సీఐ మాట్లాడుతూ గృహహింస మరియు వరకట్నం వేధింపులు జరిగిన వెడల 181 నెంబరు కాల్ చేసి మీ సమస్యను తెలియపర్చాలి అని అన్నారు. అలాగే అత్యవసర సేవలు కొరకు 112 నెంబర్ కు కాల్ చేయాలని. మహిళా వేదింపులు మరియు అక్రమ రవాణా జరిగిన యడల 1091 కు కాల్ చేయాలని. పిల్లల మీద లైగిక వేదింపులు జరిగిన యడల 1098 నెంబరు కు కాల్ చేయాలని. సైబర్ నేరము జరిగిన యడల 1030 నెంబరు గల ఫోన్ చేయాలి అని. గుడ్ టచ్ మరియు బ్యాడ్ టచ్ గురించి బాలికలకు అవగాహన కల్పించారు,అదేవిధంగా రోడ్డు ప్రమాదల గురించి కూడా పలు సూచనలు చేశారు, ఈ కార్యక్రమమూలో సుమారుగా 60 మంది టొబాకో కంపెనీలో పని చేసే మహిళలు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంపై "ఎల్ నిన్యో" పుస్తకాన్ని ఆవిష్కరించిన ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి



**ఏలేశ్వరం,(అఖండభూమి న్యూస్ మే 22):** ఏలేశ్వరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయం రంగంలో రైతులకు అవగాహన పెంపొందించే లక్ష్యంతో రూపొందించిన "ఎల్ నిన్యో" అనే ప్రత్యేక పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని ఏలేశ్వరం మండల ఎంపీపీ గొల్లపల్లి నరసింహమూర్తి (బుజ్జి) ఆవిష్కరించగా,వ్యవసాయ రంగంలో సుస్థిర అభివృద్ధి,రసాయన రహిత సాగు విధానాలు,నేల ఆరోగ్యం పరిరక్షణ వంటి అంశాలపై రైతులకు ఉపయోగపడే విధంగా ఈ పుస్తకం రూపొందించబడింది.ఈ కార్యక్రమంలో భద్రవరం ఎంపీటీసీ సభ్యులు కొప్పుల బాబ్జి,ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కొండరాజు తదితరులు పాల్గొన్నారు.ప్రకృతి వ్యవసాయం ద్వారా దిగుబడులు పెంచడం మాత్రమే కాకుండా,భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తి అందించడానికి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు.

# నెలకు రూ. కోటి ఖర్చు చేస్తున్నా ఉపయోగం సున్నా

అపరిశుభ్రతపై శానిటరీ ఇన్స్పెక్టర్ పై సీరియస్

రత్నగిరి, సత్యగిరి ప్రాంగణాలు పరిశీలన

కొత్త కాంక్రీట్ సిమెంట్ రోడ్లను నిర్మించాలి

అన్నవరం దేవస్థానం ఈవో చక్రధరరావు ఆదేశం





**అన్నవరం, మే 22 (అఖండ భూమి న్యూస్):** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలోని రత్నగిరి, సత్యగిరి ప్రాంగణాలను దేవస్థానం కార్యనిర్వహణ అధికారి నల్లం సూర్య చక్రధరరావు శుక్రవారం పరిశీలించారు. దేవస్థానం ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్, శానిటేషన్ అధికారులతో కలసి రత్నగిరి, సత్యగిరులపై క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు. అందలి వసతి సముదాయాలను పరిశీలించి సత్రం గదుల్లో పరిశుభ్రతా వాతావరణాన్ని ఉంచాలని శానిటేషన్ అధికారులను ఆదేశించారు. మొదటి, రెండవ ఘాట్ రోడ్లను, డ్రెయిన్లను పరిశీలించి అవసరమైన చోట్ల మరమ్మతులను చేపట్టాలని,కొన్ని చోట్ల కాంక్రీట్ సిమెంట్ రోడ్లను నిర్మించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. దేవస్థానం దిగువన గ్రామంలోని కొత్తపేటలోని దేవస్థానం గోశాలను పరిశీలించి, గోవులకు అన్ని సౌకర్యాలూ సక్రమంగా ఉండాలని, గోశాలలో అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టాలని, దేవస్థానం వ్యాప్తంగా ఉన్న అన్ని రోడ్లు, డ్రైన్లు పరిశీలించి తక్షణం మరమ్మతులు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. రత్నగిరిపై ఆన్ లైన్ ద్వారా భక్తులు పొందే సేవా టికెట్ల ప్రాంతాన్ని పరిశీలించి, టిక్కెట్ల కొరకు భక్తులు ఎక్కువ సమయం నిరీక్షించకుండా వారికి టికెట్స్ అందజేయాలని అక్కడ సిబ్బందికి సూచించారు. వీటితోపాటు ప్రధాన ఆలయం ప్రాంగణాలు, క్యూలైన్లు పరిశీలించి భక్తులకు త్వరిత గతిన దర్శనం పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని, ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉన్న దృష్ట్యా క్యూలైన్లలో భక్తులకు నిరంతరాయంగా చల్లని తాగు నీరు, సర్క్యులర్ మండపం వద్ద చల్లని మజ్జిగ అందించాలని ఆదేశించారు. సత్య గిరిపై ఉన్న హరిహర సదన్ సత్రం గదులను, ప్రాంగణాలను పరిశీలించారు. సత్రం గదుల్లో దుప్పట్లను శుభ్రం చేసే వాషింగ్ మెషీన్లను పరిశీలించి, విద్యుత్ శాఖ అధికారులకు పలు సూచనలు చేసారు.

**శానిటేషన్ పై సీరియస్:** దేవస్థానంలో పలు పరిసరాలు, సత్యగిరిపై హరిహర సదన్ ప్రాంగణాలు అపరిశుభ్రంగా ఉండటంతో దేవస్థానం శానిటరీ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర రావుపై ఈఓ చక్రధరరావు ఆగ్రహం వ్యక్తం చేసారు. మీవల్ల కాకపోతే తప్పుకోండని, పరిసరాలు పరిశుభ్రంగా లేకుంటే కఠిన చర్యలు తప్పవని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. శానిటరీ నిర్వహణకు దేవస్థానం ప్రతీ నెలా సుమారు కోటి రూపాయలు చెల్లిస్తున్నా బాధ్యతగాఎందుకు లేరంటూ "పద్మావతి కాంట్రాక్టు" ఉద్యోగులపై మండి పడ్డారు. పాలనలో పారదర్శకత ఉండాలన్నారు. కార్య నిర్వహణ అధికారి వెంట ఇంజనీరింగ్ ఈఈ రామకృష్ణ, ఎలక్ట్రికల్ డిఇ విశ్వనాధుల సత్యనారాయణ, శానిటరీతో పాటు పలువురు అధికారులు ఉన్నారు.

## ఆర్మూర్ ఆర్టీసీలో లేడీ హిట్లర్..?

-సెలవులు లేవు-డే ఆఫ్ లు లేవు..?

-వాష్ రూమ్ కు వెళ్లడాలు లేవు-క్యాంటీన్ కు పోవడానికి లేదు..

-ఎస్ టి ఐ (లేడీ హిట్లర్) ఆదేశాలు..




**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మనోహర్ మే 22 (అఖండ భూమి న్యూస్):** ఆర్మూర్, ఆర్టీసీ శాఖలో సీనియర్ ట్రావెల్ ఇన్స్పెక్టర్ గా పనిచేస్తున్న ఎస్ టి ఐ (లేడీ హిట్లర్) ఆగడాలు మితిమీరుతున్నాయని కార్మికులు ఆరోపిస్తున్నారు. కార్మికుల ఆరోపణలు ఇలా ఉన్నాయి. ఆడవాళ్ళ కు అవసరాలు ఏముంటాయో ఒక మహిళ ఎస్టిఐ కి తెలియదా, అని మహిళా కండక్టర్లు ప్రశ్నిస్తున్నారు. నీళ్లు త్రాగడానికి క్యాంటీన్ కు వెళ్లాలన్నా, చివరికి వాష్ రూమ్ కు వెళ్లాలన్నా ఎస్ టి ఐ మేడం పరిమిషన్ తీసుకొని వెళ్లాలంట, సెలవులు, డే ఆఫ్ లు, స్పెషల్ హాఫ్ లు మేడం ఇస్తేనే తీసుకోవాలంట ఇదెక్కడి న్యాయమని మహిళా కండక్టర్లు ప్రశ్నిస్తున్నారు. ఆర్మూర్ కు రాగానే మీకు వాష్ రూమ్ వస్తదా అని మేడం ప్రశ్నించడం మా దౌర్భాగ్యమని మహిళా కండక్టర్లు ఆరోపిస్తున్నారు. గత ఏడాది కాలం నుండి మేడం (లేడీ హిట్లర్) టార్చర్ ని తట్టుకోలేక పోతున్నామని, ఇలాగైతే ఎలా డ్యూటీలు చేసుకునేదని వాపోతున్నారు. మగవాళ్లు, ఆడవాళ్ళ పైన దురుసుగా మాట్లాడడం ఎస్ టి ఐ మేడంకు అలవాటుగా మారిందని, ఇప్పటివరకు ఇలాంటి మేడంను చూడలేదని అంటున్నారు. ఇలాంటి మేడం తమకు వద్దని, ఈ విషయాలపై ఈ ఆరోపణలపై జిల్లా ఆర్టిసి ఉన్నతాధికారులు విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### బాన్సువాడ లోను మేడం పై ఆరోపణలు

మేడం బాన్సువాడ బస్ డిపోలో పనిచేస్తున్న సమయంలో మేడం టార్చర్ ను తట్టుకోలేక ఒక డ్రైవర్ పాయిజన్ తాగితే అతని బంధువులు మేడం పై దాడి చేయడానికి దిగితే మేడం ను కార్మికులు దాచిపెట్టి అక్కడి నుండి నిజామాబాద్-2 డిపోకు పంపించారని ఆలస్యంగా తెలిసింది.

## ప్రజాపాలనలో రవాణా కష్టాలు: ఎర్రటి ఎండలో ఆటోల కోసం ఎదురుచూపులు...!!



**వలిగొండ మే 22. ప్రతినిధి కళ్లెం బాలకృష్ణ మే 22 (అఖండ భూమి న్యూస్):** వలిగొండ నుండి మోత్కూర్, అలాగే మోత్కూర్ నుండి వలిగొండ మార్గంలో సరైన ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం వందలాది మంది ప్రయాణించే ఈ హైవే మార్గంలో బస్సులు నడవకపోవడంతో, ప్రజలు ఈ ఎర్రటి ఎండలో గంటల తరబడి రోడ్లపైనే నిల్చోవాల్సి వస్తోంది. ప్రైవేట్ ఆటోల కోసం వేచి చూస్తూ ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

### భయాందోళనలో ప్రయాణికులు

హైవే రోడ్డు కావడంతో, వాహనాలు అతివేగంగా దూసుకెళ్తుంటాయి. బస్సు సౌకర్యం లేకపోవడం వల్ల ప్రయాణికులు రోడ్డుపైకి వచ్చి ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని నిలబడాల్సి వస్తోంది. ఈ రూట్లో గతంలో జరిగిన పలు ప్రమాదాలకు ప్రయాణికులు రోడ్లపై నిల్చోవడం, ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించడమే ప్రధాన కారణాలని స్థానికులు చెబుతున్నారు. ఎప్పుడు ఏ వాహనం వచ్చి ఢీకొడుతుందో తెలియని భయానక వాతావరణంలో, నిత్యం ఆందోళన చెందుతూ ప్రయాణం చేయాల్సి వస్తోందని వారు వాపోతున్నారు.

### బస్సు సర్వీసులు పునరుద్ధరించాలి..

ప్రస్తుత ప్రజాపాలనలోనైనా తమ రవాణా కష్టాలు తీరుతాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోకముందే అధికారులు స్పందించాలని కోరుతున్నారు. వలిగొండ - మోత్కూర్ మధ్య బస్సు సర్వీసులను వీలైనంత త్వరగా పునరుద్ధరించి, ప్రయాణికుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని స్థానిక ప్రజలు, ప్రయాణికులు, స్థానిక ప్రజా ప్రతినిధులు ప్రభుత్వానికి మరియు ఆర్టీసీ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు...

## నవనాథపురం ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా గంగామోహన్

-ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కార్యవర్గం..

-గౌరవ అధ్యక్షునిగా సాత్ పుతే శ్రీనివాస్..

-జర్నలిస్టుల ఐక్యతే ఏకగ్రీవ ఎన్నిక..




**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మనోహర్ మే 22 (అఖండ భూమి న్యూస్):** ఆర్మూర్, నవనాథపురం ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షునిగా సుంకరి గంగామోహన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆర్మూర్ ప్రెస్ క్లబ్ భవనంలో శుక్రవారం నవనాథపురం ప్రెస్ క్లబ్ ఎన్నికలు జరిగాయి. కార్యదర్శిగా మ్యాకల దినేష్, ఉపాధ్యక్షునిగా శికారి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా అబ్దుల్ అజీమ్, కోశాధికారిగా తొగర్ల రాజేందర్, గౌరవ అధ్యక్షునిగా సాత్ పుతే శ్రీనివాస్, సలహాదారులుగా మంచిర్యాల నరేందర్, బారడ్ గణేష్, సభ్యులుగా తమ్మె వినోద్, గోజురు మహిపాల్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సుంకరి గంగామోహన్ మాట్లాడుతూ.... తమ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. మాజీ అధ్యక్షుడు తో పాటు సభ్యులందరి సలహాలు, సూచనల మేరకు ముందుకు సాగుతనన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కోసం కృషి చేస్తానన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి మిఠాయిలు తినిపించారు. నూతన కార్యవర్గాన్ని అభినందించారు. ఎన్నికల అధికారులుగా మంచిర్యాల నరేందర్, సాత్ పుతే శ్రీనివాస్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో నవనాథపురం ప్రెస్ క్లబ్ సభ్యులు సంజీవ్, శ్రావణ్, కోడె మనోహర్, విన్సెంట్, వెంకటేశ్వర్ గుప్తా, సామ సురేష్, మోహన్ రెడ్డి, సూరిబాబు, చరణ్ గౌడ్, మహేష్, గటడి అశోక్, లిక్కి శ్రావణ్, రాంపూర్ శ్రావణ్, చిరంజీవి, ముఖేష్, నితీష్, గటడి అరుణ్, ముద్రకోల వినోద్, గటడి రాజ్ కుమార్, పోహార్ కిరణ్, విట్టల్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం నల్లగొండ జిల్లా చైర్మన్‌గా బోడ స్వామి...!

నల్లగొండ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్‌గా బోడ స్వామి పునర్నియామకం



**నల్లగొండ జిల్లా ప్రతినిధి కురుపాటి గణేష్ మే 22 (అఖండ భూమి న్యూస్):** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ, కాంగ్రెస్ పార్టీ నల్లగొండ జిల్లా ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్‌గా సీనియర్ నాయకులు, ప్రజా పక్షపాతి బోడ స్వామి మరోసారి ఎన్నికయ్యారు..పార్టీ పట్ల ఆయనకున్న నిబద్ధతను, దళిత, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన నిరంతర కృషిని గుర్తించిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఈ బాధ్యతలను మరోమారు ఆయనకే అప్పగించింది..బోడ స్వామి జిల్లా చైర్మన్‌గా పునర్నియమితులైన సందర్భంగా జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు, యువజన విభాగాలు మరియు ప్రజా సంఘాల నాయకులు ఆయనకు హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు..ఈ సందర్భంగా ముఖ్య అనుచరులు మరియు కాంగ్రెస్ కార్యకర్తలు మాట్లాడుతూ...బోడ స్వామి గత పదవీ కాలంలో జిల్లా వ్యాప్తంగా ఎస్సీ సామాజిక వర్గాల సమస్యలపై నిరంతరం పోరాడారు..పార్టీ బలోపేతానికి, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై కాంగ్రెస్ శ్రేణులను ఏకం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారు..అధిష్టానం ఆయనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, రాబోయే రోజుల్లో జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత ఉన్నత స్థానానికి తీసుకెళ్తారని మాకు పూర్తి నమ్మకం ఉంది..మా ప్రియతమ నాయకుడు, సోదరుడు బోడ స్వామి అన్నకు హృదయపూర్వక అభినందనలు" అని పేర్కొన్నారు..మరోసారి జిల్లా చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన బోడ స్వామి గారు పార్టీ అధిష్టానానికి, తనకు సహకరించిన ప్రతి ఒక్క కార్యకర్తకు, నాయకునికి కృతజ్ఞతలు తెలిపారు..జిల్లాలో ఎస్సీల హక్కుల రక్షణకై, కాంగ్రెస్ పార్టీ విజయభేరి కొరకై మరింత ఉత్సాహంతో పని చేస్తానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు...

## ఘనంగా భాగ్యరెడ్డి వర్మ జయంతి ఉత్సవాలు





**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 22 (అఖండ భూమి న్యూస్):** సామాజిక సంస్కర్త, దళితోద్యమ ప్రముఖ నాయకుడు భాగ్యరెడ్డి వర్మ జయంతి ఉత్సవాలను శుక్రవారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ జ్యోతి ప్రజ్వలన గావించి, భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, భాగ్యరెడ్డి వర్మ సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి విశేషంగా కృషి చేశారని అన్నారు. విద్య, సామాజిక సమానత్వం, హక్కుల సాధన కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. సమాజంలో వెనుకబడిన వర్గాలకు విద్యే ప్రధాన ఆయుధమని భావించి, వారికి చైతన్యం కల్పించేందుకు ఆయన నిరంతరం కృషి చేశారని తెలిపారు. భాగ్యరెడ్డి వర్మ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని సమానత్వ భావనతో సమాజ అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, గాజ డెవలప్మెంట్ శీటటఱఎవతీ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు, వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గొర్రెల శ్రీలక్ష్మికి అత్యవసర చికిత్స నిమిత్తం 49,400 రూపాయల ఎల్ఓసి అందజేసిన జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్



**కాకినాడ జిల్లా జగ్గంపేట మే 22 (అఖండ భూమి న్యూస్):** జగ్గంపేట మండలం రాజపూడి గ్రామానికి చెందిన గొర్రెల శ్రీలక్ష్మి ఆపరేషన్ కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన రూ. 49,400 ఎల్ ఓ సి ను జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ కుమార్ స్థానిక రావులమ్మ నగర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో అందజేశారు. ఈ సందర్భంగా జ్యోతుల నవీన్ కుమార్ మాట్లాడుతూ, పేద ప్రజల ఆరోగ్యమే తెలుగుదేశం ప్రభుత్వ ధ్యేయం అని అన్నారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా అత్యవసర వైద్యం అవసరమైన వారికి వెంటనే సాయం అందిస్తున్నామని తెలిపారు. పార్టీ కార్యకర్తలు ప్రతి గ్రామంలో సమస్యలు గుర్తించి అర్హులకు న్యాయం చేయాలని సూచించారు. సహాయం అందుకున్న శ్రీలక్ష్మి కుటుంబం చంద్రబాబు ప్రభుత్వానికి, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కి ,జ్యోతుల నవీన్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపింది ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు జీను మణి బాబు, జిల్లా అధికార ప్రతినిధి రేకా బులిరాజు, గోవిందపురం మాజీ సర్పంచ్ కమ్మిల వెంకటేశ్వరరావు, పీలా మహేష్, కంచి కృష్ణ, కంచి మణి బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్-516 పనులపై జేసీ సమీక్ష

పెండింగ్ సివిల్ డిపాజిట్ కేసుల నివేదిక వెంటనే సమర్పించాలి జాయింట్ కలెక్టర్ శ్రీ పూజ



**జి.మాడుగుల, మే 22 (అఖండ భూమి న్యూస్):** పాడేరు నుంచి జి.మాడుగుల వరకు కొనసాగుతున్న జాతీయ రహదారి (ఎన్‌హెచ్-516) విస్తరణ పనులను జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీ పూజ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ ఆదిత్య వర్మ, జాతీయ రహదారి అధికారులతో కలిసి పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా జి.మాడుగుల తహశీల్దార్ కార్యాలయంలో అధికారులు సమావేశమై పెండింగ్‌లో ఉన్న సివిల్ డిపాజిట్ కేసులపై చర్చించారు. కేసులకు సంబంధించిన పూర్తి నివేదికను వెంటనే సమర్పించాలని, వాటిని యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. రహదారి విస్తరణ పనుల్లో ఎలాంటి ఆటంకాలు లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పనుల ఆలస్యానికి గల కారణాలపై కూడా ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జి.రాజ్‌కుమార్, నేషనల్ హైవే అసిస్టెంట్ ఇంజనీర్ లోకేష్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలి. ఏపీ జెఎసి పల్నాడు జిల్లా అధ్యక్షులు నాగమల్లేశ్వరరావు



**మాచవరం మే 22 (అఖండ భూమి న్యూస్):** ప్రభుత్వ ఉద్యోగులకు రక్షణ కపిల్ శాసన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఎంతైనా ఉందని ఏపీ జేఏసీ పలనాడు జిల్లా అధ్యక్షులు మాచవరం తహసిల్దార్ నాగమల్లేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో తీవ్ర ఎండలు వడగాలిపులు నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగులకు రక్షణ చర్యలు తీసుకోవాలని వారి డిమాండ్ చేశారు కదా రెండు రోజులుగా 47 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్న నేపథ్యంలో అధికారులు విధులకు హాజరు కావాలంటే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు అన్నారు ముఖ్యంగా జనాభా గణన సర్వే నిర్వహిస్తున్న అధికారులు ఎండ వేడిమి కి తీవ్ర ఇబ్బందులు గురవుతున్న అని అలాగే ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ఆయన అన్నారు ఉద్యోగుల ఆరోగ్య భద్రత దృశ్య ప్రత్యేక శ్రద్ధ చూపాలని సర్వేను కొన్ని రోజులు నిలిపివేయాలని వారు కోరారు అలాగే ఆర్టీసీ డ్రైవర్లకు కండక్టర్లకు ఎండ వేడిమి తట్టుకోవడమునకు తెల్ల టవల్సులను అందుబాటులో మంచినీటిని ఏర్పాటు చేయాలని సూచించారు అలాగే ముఖ్యంగా మహిళా కంటెంట్లకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలన్నారు. పల్నాడు జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో పని వేళలు తీవ్ర ఎండ పరిస్థితులకు అనుగుణంగా నిర్వహించాలన్నారు ప్రభుత్వ కార్యాలయాల్లో రెండుసార్లు మజ్జిగ శీతల పానీయాలు పంపిణీ చేయాలన్నారు సాయంత్రం 5:00 కల్లా ప్రభుత్వ కార్యాలయాలు పూర్తిస్థాయిలో మూసివేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు ఎటువంటి సిబ్బందిని అదనపు విధుల్లోకి తీసుకు రాకూడదన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్కు రాష్ట్ర ప్రభుత్వానికి వినతి పత్రాలు పంపిణీ చేశామన్నారు

## రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు కలిసిన : కాంగ్రెస్ పార్టీ శ్రేణులు...!









**ప్రతినిధి కురుపాటి గణేష్ హైదరాబాద్ మే 22 (అఖండ భూమి న్యూస్):** హైదరాబాద్ జూబ్లీహిల్స్ లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు అనుముల రేవంత్ రెడ్డి నివాసంలో, రాష్ట్ర పరిధిలోనీ గిరిజన ప్రాంతాలలోని సమస్యల పరిష్కారం, తండాల లో చేపట్టవలసిన అభివృద్ధి పనుల విషయమై ముఖ్యమంత్రితో జరిగే సమీక్ష సమావేశానికి హాజరయ్యేందుకు ముఖ్యమంత్రి నివాసానికి చేరుకొని,వారి రాకకోసం వేచిచూస్తున్న తెలంగాణ రాష్ట్ర లంబాడీ ప్రజా ప్రతినిధులు..ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, శాసనమండలి సభ్యులు కేతావత్ శంకర్ నాయక్, దేవరకొండ నియోజకవర్ శాసనసభ్యులు ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్, డా. రాంచందర్ నాయక్, డా. మురళి నాయక్, మాలోతు రాందాస్ నాయక్, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్,మాజీ శాసన మండలి సభ్యుడు సభావత్ రాములు నాయక్ మరియు టీపీసీసీ అధికార ప్రతినిధి ధరావత్ వెంకన్న నాయక్ పాల్గొన్నారు.

## కౌమార బాలికల హెల్త్ స్క్రీనింగ్ క్యాంప్...!








**ప్రతినిధి కురుపాటి గణేష్ చండూరు మండలం మే 22 (అఖండ భూమి న్యూస్):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మక చేపడుతున్న "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమములో భాగంగా శుక్రవారం నాడు స్థానిక పి.ఆర్. గెస్ట్ హౌస్ నందు మెప్మా అద్వర్యంలో "కౌమార బాలికలు 15 నుండి 18 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలికలు" హెల్త్ స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించడం జరిగింది..మున్సిపల్ చైర్మన్ డాక్టర్. కోడి శ్రీనివాసులు హెల్త్ క్యాంపును ప్రారంభించడం జరిగింది..ఇందులో భాగంగా మున్సిపల్ కమీషనర్ ఎల్.మల్లేశం మాట్లాడుతూ...మానవ వికాస దశల్లో కౌమార దశ అతి ముఖ్యమైనదని, శారీరక మానసిక మార్పులు జరిగే దశగా చెప్పటమైంది..ఆరోగ్యం పట్ల శ్రద్ధ కలిగి ఉండాలని పేర్కొన్నారు..అలాగే మున్సిపల్ వైస్ చైర్మన్ భూతరాజు దశరథ, 1వ వార్డు కౌన్సిలర్ తేలుకుంట్ల రాజకుమారి-చంద్రశేఖర్, 10వ వార్డు కౌన్సిలర్ కటకం రమేష్ తగు సూచనలు చేయడం జరిగింది..ఇట్టి కార్యక్రమముకు మున్సిపల్ చైర్మన్ డాక్టర్.కోడి శ్రీనివాసులు, మున్సిపల్ కమీషనర్ ఎల్.మల్లేశం, మున్సిపల్ వైస్ చైర్మన్ భూతరాజు దశరథ, 1వ వార్డు కౌన్సిలర్ తేలుకుంట్ల రాజకుమారి-చంద్రశేఖర్, 2వ వార్డు కౌన్సిలర్ బుషిపాక వాసు, 5వ వార్డు కౌన్సిలర్ కొన్ రెడ్డి మధు, 10వ వార్డు కౌన్సిలర్ కటకం రమేష్ , డా. రాజు, డా.జెస్సి, మెప్మా టీఎంసీ, ఎన్.సరిత, ఏఎన్ఎం, ఆశా-వర్కర్లు మరియు ఆర్.పి.లు పాల్గొన్నారు..

అఖండ భూమి

శనివారం 23-05-2026

# మైసూర్ శాండల్ సబ్బు యజమాని ఎవరు? ప్రభుత్వానిదా..?లేక ప్రైవేట్ కంపెనీదా?




దీని సబ్బును కర్ణాటక ప్రభుత్వానికి చెందిన కర్ణాటక సోప్స్ అండ్ డిటర్జెంట్స్ లిమిటెడ్ తయారు చేస్తుంది. ఈ బ్రాండ్‌ను దేశవ్యాప్తంగా విస్తరించే ప్రణాళికపై కంపెనీ పనిచేస్తోంది. దేశవ్యాప్తంగా 480 మంది కొత్త పంపిణీదారులను జోడించడం, జమ్మూ.. దక్షిణ భారతదేశపు ప్రముఖ బ్రాండ్ మైసూర్ శాండల్ సోప్ నటి తమన్నా భాటియాను తన కొత్త బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకుంది. కంపెనీ ఈ సమాచారాన్ని సోషల్ మీడియా పోస్ట్ ద్వారా తెలిపింది. కానీ కంపెనీ ఈ నిర్ణయం తర్వాత ఇప్పుడు ఒక వివాదం తలెత్తింది. కన్నడ పరిశ్రమలో కూడా ప్రతిభావంతులైన నటీమణులు ఉన్నప్పుడు బయటి నటిని బ్రాండ్ ముఖంగా ఎందుకు చేశారని అడుగుతూ చాలా మంది కన్నడ సినీ నటులు, సోషల్ మీడియా వినియోగదారులు విమర్శలు గుప్పిస్తున్నారు.

**దక్షిణ భారతదేశంలోని ప్రముఖ బ్రాండ్:**

మైసూర్ శాండల్ సబ్బు దక్షిణ భారతదేశంలో సంవత్సరాలుగా విశ్వసనీయమైన పేరు. దాని మొత్తం అమ్మకాలలో దాదాపు 81 శాతం దక్షిణాది రాష్ట్రాల నుండే వస్తున్నాయి. ఇందులో ఆంధ్రప్రదేశ్ అతిపెద్ద వినియోగదారుల రాష్ట్రం. తరువాత తమిళనాడు, తరువాత కర్ణాటక ఉన్నాయి. వినియోగదారులకు ఈ బ్రాండ్‌తో లోతైన సాంస్కృతిక సంబంధం ఉంది. ఇది దక్షిణ భారతదేశంలో ఇప్పటికీ చాలా సందర్భోచితంగా ఉంటుంది.

**యజమాని ఎవరు?**

దీని సబ్బును కర్ణాటక ప్రభుత్వానికి చెందిన కర్ణాటక సోప్స్ అండ్ డిటర్జెంట్స్ లిమిటెడ్ (%ఖూణూ%) తయారు చేస్తుంది. ఈ బ్రాండ్‌ను దేశవ్యాప్తంగా విస్తరించే ప్రణాళికపై కంపెనీ పనిచేస్తోంది. దేశవ్యాప్తంగా 480 మంది కొత్త పంపిణీదారులను జోడించడం, జమ్మూ కాశ్మీర్, నాగాలాండ్, గుజరాత్, పంజాబ్ వంటి రాష్ట్రాలకు ఈ సబ్బు పరిధిని విస్తరించడం కంపెనీ వ్యూహం.

**రికార్డు టర్నోవర్**

మైసూర్ శాండల్ సబ్బును మాత్రమే కాకుండా శుభ్రపరిచే ఉత్పత్తులు, అగరుబత్తులను కూడా తయారు చేస్తుంది. అయితే మైసూర్ సబ్బు అత్యంత ప్రజాదరణ పొందింది. మార్చి 2024 చివరి నాటికి, కంపెనీ రూ. 1,500 కోట్ల రికార్డు టర్నోవర్‌ను సాధించింది. ఇది గత 40 ఏళ్లలో అత్యుత్తమ పనితీరు.

**100% స్వచ్ఛమైన గంధపు నూనెతో తయారు చేసిన సబ్బు:**

మైసూర్ శాండల్ సబ్బును ప్రత్యేకంగా చేసేది దాని 100% స్వచ్ఛమైన గంధపు నూనె. ప్రపంచంలో ఎలాంటి సింథటిక్ సువాసన లేని ఏకైక సబ్బు ఇదే. దీని సహజ గంధపు సువాసన చాలా కాలం పాటు ఉంటుంది. చర్మానికి చాలా మంచిదని కూడా పరిగణిస్తారు. ఇది భారతీయ సంప్రదాయం, సాంస్కృతిక వారసత్వానికి చిహ్నంగా ఉంది. భౌగోళిక సూచిక ట్యాగ్‌ను పొందిన భారతదేశపు మొట్టమొదటి సబ్బు ఇది.

# పారదర్శక పరిపాలన అందించడమే రేవంత్ రెడ్డి సర్కార్ ధ్యేయం







**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 22 (అఖండ భూమి న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో పారదర్శక పరిపాలన అందించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం లక్ష్యంగా పనిచేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. శుక్రవారం కామారెడ్డి పట్టణంలోని సత్య గార్డెన్‌లో ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సమీక్ష సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ గారు హాజరయ్యారు. కార్యక్రమంలో పోచారం శ్రీనివాస్ రెడ్డి, తోట లక్ష్మి కాంతారావు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల, ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ,కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రభుత్వ శాఖలు ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న సేవలు, భవిష్యత్ కార్యాచరణపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అవసరాలను కేంద్రబిందువుగా తీసుకొని పారదర్శక పరిపాలన అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు నేరుగా చేరే విధంగా అధికారులు పని చేయాలని సూచించారు. ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమం కేవలం సమీక్ష సమావేశాలకు పరిమితం కాకుండా గ్రామాలు, పట్టణాల్లో కనిపించే మార్పుగా మారాలని అన్నారు. ప్రతి శాఖకు ప్రభుత్వం స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించిందని, వాటి అమలులో వేగం పెంచాలని సూచించారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చివరి వ్యక్తికి చేరేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని, ప్రజల సమస్యలను వినడం మాత్రమే కాకుండా వాటికి త్వరితగతిన పరిష్కారం చూపాలని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, తాగునీరు, రోడ్లు, గ్రామీణాభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో జిల్లా స్థాయిలో మరింత మెరుగైన ఫలితాలు సాధించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు ప్రభుత్వంపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునే బాధ్యత ప్రతి అధికారిపై ఉందని తెలిపారు. ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమం ప్రజల జీవన ప్రమాణాలను పెంచే దిశగా ఉండాలని, సమయపాలనతో పనులు పూర్తి చేసి జిల్లాను రాష్ట్రంలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మున్సిపాల్ చైర్మన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, జిల్లా గ్రంధాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, అదనపు కలెక్టర్ గిరి, డీఎస్పీ మధుసూదన్, మాజీ డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్లు లక్ష్మి, పాత రాజు, పట్టణ అధ్యక్షులు సందీప్, కౌన్సిలర్లు అంజాద్, వాజీద్, మజీద్, కాళ్ళ గణేష్, గడ్డమీది మహేష్, లడ్డు, సత్యం, షేరు, జిల్లా నాయకులు అశోక్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గొనె శ్రీనివాస్, సుదర్శన్, మండల అధ్యక్షులు రాజగోడ్, శ్రీనివాస్, నౌసిలాల్, కృష్ణ రావు, మాజీ మండల అధ్యక్షులు సుతారి రమేష్, అనంత్ రెడ్డి, గూడెం శ్రీనివాస్, యాదవ రెడ్డి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆ టాటా స్టాక్‌తో కష్టాలకు టాటా.. ఐదేళ్లల్లో నమ్మలేని రాబడి



ఇటీవల కాలంలో ప్రజల్లో పెరిగిన ఆర్థిక అక్షరాస్యత నేపథ్యంలో స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడికి ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా యువత చిన్న మొత్తాల పొదుపు పథకాల్లో కాకుండా వివిధ కంపెనీల స్టాక్స్ కొనుగోలు చేస్తూ రిస్క్ అయినా పర్లేదని పెట్టుబడులకు ముందుకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఓ ప్రముఖ కంపెనీ టాటాకు సంబంధించిన స్టాక్‌లు మంచి రాబడినిచ్చాయి. టాటా టెలీ సర్వీసెస్ మహారాష్ట్ర (టీటీఎంఎల్) మరోసారి మార్కెట్ దృష్టిని ఆకర్షించింది. గత మూడు ట్రేడింగ్ సెషన్లలో దాని స్టాక్ మంచి రాబడినిచ్చింది. గత ఐదు సంవత్సరాలుగా పెట్టుబడిదారులకు అద్భుతమైన రాబడిని అందించడంలో పేరు పొందిన టీటీఎంఎల్ గత రెండు సెషన్లలో ఏకంగా 30 శాతం రాబడిని ఇచ్చింది. ముఖ్యంగా ఈ మల్టీబ్యాగర్ స్టాక్ తన అప్‌వర్డ్ ట్రెండ్‌ను కొనసాగించింది. శుక్రవారం కూడా ఈ ఎన్ఎస్ఈలో 2 శాతం కంటే ఎక్కువ రాబడిని ఇచ్చింది. ముఖ్యంగా మార్కెట్ సెంటిమెంట్ బాగా ఉండడంతో టీటీఎంఎల్ షేర్లు బాగా పెరిగాయి. నిఫ్టీ 204 పాయింట్లు తగ్గి 24,610 వద్ద ముగిసింది. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు కూడా ఈ స్టాక్ కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. మార్చి 2025తో ముగిసిన త్రైమాసికంలో ఎఫ్ఐఐలు టాటా టెలిసర్వీసెస్ మహారాష్ట్రలో తమ వాటాను 2.5 శాతానికి పెంచుకున్నారు. కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ ఇప్పుడు రూ.15,000 కోట్లను అధిగమించింది. ఇటీవల 150 బిలియన్ల టాటా గ్రూప్‌నకు సంబంధించిన హోల్డింగ్ కంపెనీ అయిన టాటా సన్స్ లిమిటెడ్, నష్టాల్లో ఉన్న దాని టెలికాం అనుబంధ సంస్థ టాటా టెలిసర్వీసెస్ లిమిటెడ్ (టీటీఎస్ఎల్)కి కొత్త మూలధనాన్ని చొప్పించవచ్చని నివేదికలు వెలువడింది. దీంతో పెట్టుబడిదారులు టీటీఎంఎల్ స్టాక్స్‌ను కొనుగోలుకు ముందుకు వచ్చారు. గత ఐదు సంవత్సరాలలో టాటా టెలీసర్వీసెస్ మహారాష్ట్ర పెట్టుబడిదారులకు 2,900 శాతం రాబడిని అందించింది. గత ఆరు నెలల్లో ఈ స్టాక్ 15 శాతం లాభపడింది. ఐదు సంవత్సరాల క్రితం ఈ మల్టీబ్యాగర్ స్టాక్‌లో రూ. లక్ష పెట్టుబడి పెట్టిన పెట్టుబడిదారుడు ఇప్పుడు వారి పెట్టుబడి విలువ రూ. 2,981,132గా మారింది. ఐదు సంవత్సరాల క్రితం ఈ స్టాక్ విలువ కేవలం రూ. 2.65గా ఉండేది. ఇప్పుడు అది రూ. 79.45కి పెరిగింది. టీటీఎంటల్ స్టాక్ 5-రోజుల, 10-రోజుల, 20-రోజుల, 30-రోజుల, 50-రోజుల, 100-రోజుల, 150-రోజుల, 200-రోజుల సింపుల్ మూవింగ్ యావరేజ్‌ల కంటే ఎక్కువగా ట్రేడవుతోందని నిపుణులు చెబుతున్నారు.

# చౌకైన రీఛార్జ్‌తో 160 రోజుల వ్యాలిడిటీ.. బెనిఫిట్స్ ఇవే!

ఈ ప్లాన్ ముఖ్యంగా విద్యార్థులకు, ఆన్‌లైన్ తరగతులు తీసుకునేవారికి, ప్లాట్‌ఫామ్‌లను చూసేవారికి, ఎక్కువ డేటాను ఉపయోగించే వారికి ఉపయోగకరంగా ఉంటుంది. మీరు కూడా దీర్ఘకాల చెల్లుబాటుతో చౌకైన రీఛార్జ్ ప్లాన్ కోసం చూస్తున్నట్లయితే, ఖచ్చితంగా

**దీూచీూ :** అనేక టెలికాం కంపెనీలు తమ రీఛార్జ్ ప్లాన్‌లను ఖరీదైనవిగా చేస్తుండగా, ప్రభుత్వ టెలికాం సంస్థ తన కస్టమర్లకు ఉపశమనం కలిగించే వార్తను అందించింది. రెండు కొత్త, సరసమైన లాంగ్ వాలిడిటీ రీఛార్జ్ ప్లాన్‌లను ప్రారంభించింది. ఇవి ప్రతి నెలా రీఛార్జ్ చేయకూడదనుకునే వారికి ప్రత్యేకంగా ప్రయోజనకరంగా ఉంటాయి.

947 ప్లాన్: 160 రోజుల చెల్లుబాటు, రోజుకు 2% డేటా

అత్యంత ప్రత్యేకమైన, సరసమైన ప్లాన్ రూ.947. ఇది గతంలో రూ.997గా ఉండేది. కంపెనీ ఇప్పుడు దానిని రూ.50 తగ్గించింది. ఈ ప్లాన్ దీర్ఘకాలిక చెల్లుబాటు, ప్రతిరోజూ మంచి డేటాతో వస్తుంది.


**ఈ ప్లాన్‌లో ఈ ప్రయోజనాలు:**

160 రోజుల చెల్లుబాటు
రోజుకు 2% హై-స్పీడ్ డేటా (మొత్తం 320 )
అన్ని నెట్‌వర్క్‌లలో అపరిమిత కాలింగ్
రోజుకు 100 ఉచితం

ఇంటర్నెట్, కాలింగ్‌ను క్రమం తప్పకుండా ఉపయోగించే, మళ్లీ మళ్లీ రీఛార్జ్ చేయకుండా ఉండాలనుకునే వారికి ఈ ప్లాన్ ప్రత్యేకమైనది.

569 ప్లాన్: రోజుకు 3% డేటా 84 రోజులు

తక్కువ ధరకే ఎక్కువ డేటా కావాలనుకుంటే, రూ.569 ప్లాన్ మీకు మంచిది. గతంలో ఈ ప్లాన్ రూ.599కి వచ్చేది. కానీ ఇప్పుడు దానిని రూ.30 తగ్గించింది.




**ఈ పథకంలో అనేక ప్రయోజనాలు:**

84 రోజుల చెల్లుబాటు
రోజుకు 3% హై-స్పీడ్ డేటా (మొత్తం 25 )
అన్ని నెట్‌వర్క్‌లలో అపరిమిత కాలింగ్
రోజుకు 100 ఉచితం

ఈ ప్లాన్ ముఖ్యంగా విద్యార్థులకు, ఆన్‌లైన్ తరగతులు తీసుకునేవారికి, ప్లాట్‌ఫామ్‌లను చూసేవారికి, ఎక్కువ డేటాను ఉపయోగించే వారికి ఉపయోగకరంగా ఉంటుంది. మీరు కూడా దీర్ఘకాల చెల్లుబాటుతో చౌకైన రీఛార్జ్ ప్లాన్ కోసం చూస్తున్నట్లయితే, ఖచ్చితంగా ఈ కొత్త ప్లాన్‌లను ప్రయత్నించండి. ఇది డబ్బు ఆదా చేయడమే కాకుండా ప్రతి నెలా రీఛార్జ్ చేయడంలో ఇబ్బంది ఉండదు.

# కేవలం రూ.1,199కే దేశీయ, అంతర్జాతీయ విమాన టిక్కెట్.. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోండిలా..



కంపెనీ ప్రయాణీకులకు ప్రీపెయిడ్ బ్యాగేజీపై 40% వరకు తగ్గింపు, సీటు ఎంపికపై 20% తగ్గింపు పొందే అవకాశాన్ని కూడా కల్పించింది. క్రెడిట్ కార్డ్ వినియోగదారులు కంపెనీ అధికారిక వెబ్‌సైట్ నుండి లేదా యాప్ ద్వారా బుక్ చేసుకుంటే.. ఎయిర్ ఇండియా తన వేసవి ఆఫర్‌ను ప్రకటించింది. శుక్రవారం ఒక పత్రికా ప్రకటన ద్వారా ఈ అమ్మకం గురించి కంపెనీ సమాచారం ఇచ్చింది. అమ్మకం సమయంలో దేశీయ, దేశీయ విమానాలపై కంపెనీ భారీ తగ్గింపులను అందిస్తోంది. కంపెనీ ప్రకారం, ప్రమోషనల్ సేల్స్ సమయంలో దేశీయ మార్గాల్లో వన్-వే విమానానికి కేవలం రూ. 1199 కు బుకింగ్ చేసుకోవచ్చు. అంతర్జాతీయ రౌండ్ ట్రిప్ కోసం బుకింగ్ రూ. 11,969 నుండి ప్రారంభమవుతుంది. ఈ ఎయిర్ ఇండియా సేల్ పరిమిత కాలం మాత్రమే. మే 25న రాత్రి 11.59 గంటలకు ముగుస్తుంది. గత 24 గంటల్లో ఎయిర్ ఇండియా వెబ్‌సైట్, మొబైల్ యాప్ ద్వారా మాత్రమే బుకింగ్‌లు చేసుకోవచ్చు. చాలా గమ్యస్థానాలకు ప్రయాణ తేదీలను సెప్టెంబర్ 30 వరకు పొడిగించారు. అలాగే , కెనడా, యూరప్, ఆస్ట్రేలియాతో సహా ఎంపిక చేసిన సుదూర అంతర్జాతీయ మార్గాలకు బుకింగ్‌లు డిసెంబర్ 10 వరకు చేయవచ్చు. ఎయిర్ ఇండియా వినియోగదారులకు ప్రత్యేక ప్రయోజనాన్ని అందించింది. ఎయిర్ ఇండియా వెబ్‌సైట్ లేదా మొబైల్ యాప్ నుండి వినియోగదారు నేరుగా బుకింగ్ చేసుకుంటే, సౌలభ్య రుసుము ఉండదు. అలాగే అదనపు పొదుపులు కూడా ఉండవు. దీని కోసం వినియోగదారులు కోడ్‌ని ఉపయోగించి రూ.3000 వరకు తగ్గింపు పొందవచ్చు. లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లించడం ద్వారా రూ.2,500 వరకు అదనపు తగ్గింపు పొందవచ్చు. దీని కోసం , చీదీూ కోడ్‌లను ఉపయోగించవచ్చు. ఇది మాత్రమే కాకుండా, కంపెనీ ప్రయాణీకులకు ప్రీపెయిడ్ బ్యాగేజీపై 40% వరకు తగ్గింపు, సీటు ఎంపికపై 20% తగ్గింపు పొందే అవకాశాన్ని కూడా కల్పించింది. క్రెడిట్ కార్డ్ వినియోగదారులు కంపెనీ అధికారిక వెబ్‌సైట్ నుండి లేదా యాప్ ద్వారా బుక్ చేసుకుంటే రూ. 500 నుండి రూ. 8000 వరకు ఆదా చేసుకునే అవకాశాన్ని పొందవచ్చు. ఇది ప్రయాణ తరగతి, గమ్యస్థానంపై ఆధారపడి ఉంటుంది. అమ్మకానికి ఉన్న సీట్లు పరిమితం అని గుర్తుంచుకోండి. ఆఫర్ మొదట వచ్చిన వారికి ముందుగా అందించబడింది. అలాగే ఎంపిక చేసిన దేశీయ, అంతర్జాతీయ మార్గాల్లో ఈ అమ్మకం వర్తిస్తుంది.

# ఆర్బీఐ ఈ బ్యాంకు పేరు మార్చింది.. మీ చెక్, పాస్‌బుక్‌లను మార్చాలా?



కస్టమర్ల మనస్సులో ఉన్న అతి పెద్ద ప్రశ్న ఏమిటంటే వారి పాత చెక్‌బుక్‌లు, పాస్‌బుక్‌లు ఇప్పుడు చెల్లుతాయా? లేదాణ అని. పాత చెక్‌బుక్‌లు, పాస్‌బుక్‌లు ఇప్పటికీ చెల్లుబాటులో ఉంటాయని బ్యాంక్ స్పష్టం చేసింది. అయితే కస్టమర్ల ప్రస్తుత బ్యాంకింగ్ పత్రాలు.. నార్త్ ఈస్ట్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ ఇటీవల తన పేరును ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్‌గా మార్చుకుంది. దీనితో పాటు, బ్యాంకు రిజిస్టర్డ్ కార్యాలయం కూడా ఇప్పుడు అస్సాంలోని గౌహతి నుండి కర్ణాటకలోని బెంగళూరుకు మారింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆమోదం పొందిన తర్వాత ఈ మార్పు అమలు చేసింది. బ్యాంక్ కొత్త పేరు ఇప్పుడు ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్. అలాగే దాని రిజిస్టర్డ్ కార్యాలయం బెంగళూరులో ఉంటుంది. దేశవ్యాప్తంగా తన పరిధిని, సేవలను మరింత బలోపేతం చేసుకునేందుకు బ్యాంక్ వ్యూహంలో ఈ మార్పు భాగం. అయితే, కస్టమర్లకు అందించే సేవలలో ఎటువంటి తగ్గింపు ఉండదని బ్యాంక్ హామీ ఇచ్చింది. ఈశాన్య భారతదేశంలోని దాని శాఖలు మునుపటిలా పనిచేస్తూనే ఉంటాయి.

**పాత చెక్ బుక్, పాస్ బుక్ ఏమవుతుంది?**

కస్టమర్ల మనస్సులో ఉన్న అతి పెద్ద ప్రశ్న ఏమిటంటే వారి పాత చెక్‌బుక్‌లు, పాస్‌బుక్‌లు ఇప్పుడు చెల్లుతాయా? లేదాణ అని. పాత చెక్‌బుక్‌లు, పాస్‌బుక్‌లు ఇప్పటికీ చెల్లుబాటులో ఉంటాయని బ్యాంక్ స్పష్టం చేసింది. అయితే కస్టమర్ల ప్రస్తుత బ్యాంకింగ్ పత్రాలు, సేవలు ప్రభావితం కావచ్చు. కొత్త పేరు, చిరునామాతో చెక్ పుస్తకాలు, పాస్‌బుక్‌ల కోసం క్రమంగా దరఖాస్తు చేసుకోవాలని వినియోగదారులకు సూచించింది. కొత్త పత్రాల కోసం కస్టమర్లు తమ సమీప శాఖను సంప్రదించాలని కూడా బ్యాంక్ తెలిపింది. దీనికి ఎటువంటి అదనపు ఛార్జీలు ఉండవని బ్యాంకు తెలిపింది.


**కస్టమర్లకు సలహా..**

కస్టమర్లు తమ బ్యాంకు ఖాతాలకు సంబంధించిన పత్రాలు, ఇతర సమాచారాన్ని అప్‌డేట్ చేయాలని బ్యాంక్ అభ్యర్థించింది. ఒక కస్టమర్ ఆన్‌లైన్ బ్యాంకింగ్ ఉపయోగిస్తే, అతను ఆన్‌లైన్ పోర్టల్‌లో కొత్త పేరు, చిరునామాతో అప్‌డేట్ చేసిన సమాచారాన్ని పొందుతారు. కస్టమర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండాలంటే కొత్త పత్రాలను సకాలంలో పొందాలని బ్యాంక్ తెలిపింది.

**పేరు ఎందుకు మార్చారు?**

పేరు, చిరునామాను మార్చాలనే నిర్ణయం బ్యాంకు తన బ్రాండ్‌ను విస్తరించడానికి, బలోపేతం చేయడానికి తీసుకున్న వ్యూహంలో భాగం. ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఇప్పుడు దేశవ్యాప్తంగా తన సేవలను మరింత మెరుగుపరచాలని లక్ష్యంగా పెట్టుకుంది. డిజిటల్ బ్యాంకింగ్, ఆర్థిక చేరికను ప్రోత్సహించడానికి ఈ చర్య తీసుకుంది. నార్త్ ఈస్ట్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఇకపై ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌గా పిలువబడుతుంది. భవిష్యత్తులో ఎలాంటి అసౌకర్యాన్ని నివారించడానికి కొత్త పత్రాలను పొందడానికి కస్టమర్లు తమ శాఖను సంప్రదించాలని సూచించారు. కస్టమర్ల సౌలభ్యం, మరియు మెరుగైన సేవల కోసం ఈ మార్పు చేసినట్లు బ్యాంక్ హామీ ఇచ్చింది.

# మ్యూచువల్ ఫండ్ సిప్‌లో ఇన్‌స్టాల్‌మెంట్ చెల్లించకపోతే సిబిల్ తగ్గుతుందా?



మీరు సిప్‌ని ఎంచుకుంటే, మీరు రుణం కోసం వాయిదాలు చెల్లించినట్లే, మీరు సిప్ వాయిదాలను క్రమం తప్పకుండా చెల్లించాలి. బ్యాంకు రుణ వాయిదాలు చెల్లించనందుకు జరిమానాలు విధిస్తారు. మీ క్రెడిట్ స్కోర్ దెబ్బతింటుంది. మీరు మ్యూచువల్ ఫండ్ సిప్‌ల..

మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టాలనుకునే చాలా మంది వ్యక్తులు %ూ్ఖూ% మార్గాన్ని ఎంచుకుంటారు. క్రమబద్ధమైన పెట్టుబడి ప్రణాళికలో ప్రజలు ప్రతి నెలా క్రమం తప్పకుండా స్థిర వాయిదాలను ఆర్‌డీ రూపంలో చెల్లించవచ్చు. చాలా మ్యూచువల్ ఫండ్‌లు దీర్ఘకాలికంగా సంవత్సరానికి చెల్లిస్తాయి. 10 నుండి 20 వరకు లాభం పొందవచ్చు. నేరుగా స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేయడం చాలా మందికి రిస్క్‌గా అనిపించవచ్చు. అందువలన మ్యూచువల్ ఫండ్ చాలా ప్రజాదరణ పొందింది. మీ వద్ద ఏకమొత్తంలో డబ్బు లేకపోతే సిప్ ద్వారా పెట్టుబడి పెట్టడం మరింత సులభం.

**క్రెడిట్ స్కోర్ తగ్గుతుందా?**

మీరు సిప్‌ని ఎంచుకుంటే, మీరు రుణం కోసం వాయిదాలు చెల్లించినట్లే, మీరు సిప్ వాయిదాలను క్రమం తప్పకుండా చెల్లించాలి. బ్యాంకు రుణ వాయిదాలు చెల్లించనందుకు జరిమానాలు విధిస్తారు. మీ క్రెడిట్ స్కోర్ దెబ్బతింటుంది. మీరు మ్యూచువల్ ఫండ్ సిప్‌లో వాయిదాలు చెల్లించడంలో విఫలమైతే మీరు అదే విధంగా జరిమానా విధించబడతారా? క్రెడిట్ స్కోర్ తగ్గుతుం సిప్‌లో ఒకటి లేదా రెండు వాయిదాలు చెల్లించకపోతే ఇబ్బంది లేదు. జరిమానా విధించరు. అయితే, మీరు వరుసగా మూడు వాయిదాలు చెల్లించడంలో విఫలమైతే, మీ సిప్ రద్దు చేయవచ్చు. సిప్ వాయిదాలను చెల్లించడంలో వైఫల్యం కొన్ని ఇతర అడ్డంకులకు దారితీయవచ్చు. మీ పెట్టుబడిపై రాబడి తక్కువగా ఉండవచ్చు. మీ ఆర్థిక క్రమశిక్షణ సడలించవచ్చు. ఈ చిన్న చిన్న సమస్యలు కాకుండా సిప్ ఇన్‌స్టాల్‌మెంట్‌ను కోల్పోతున్నందుకు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వరుసగా మూడు వాయిదాలు చెల్లించకుండా జాగ్రత్త వహించండి. వీలైనంత వరకు ప్రతి నెలా సాధారణ వాయిదాలు చెల్లించండి. స్వయంచాలక చెల్లింపు కోసం సిప్‌ని సెటప్ చేయండి. చెల్లింపు రోజున బ్యాంకులో తగినన్ని నిధులు ఉన్నాయని నిర్ధారించుకోండి. దీర్ఘకాలిక పెట్టుబడికి మ్యూచువల్ ఫండ్ సిప్ ఉత్తమమైనది. అందువల్ల, మీరు ఆర్థిక క్రమశిక్షణను సాధించడం అత్యవసరం.

# రక్తపాతం చిందిస్తున్న 'డీసీ' ట్రైలర్.. హీరోగా లోకేశ్ కనగరాజ్ సంచలనం!




**ఇక తాజాగా రిలీజైన ట్రైలర్ ప్రారంభంలోనే కారులో ఒక మహిళ భయంతో కేకలు వేస్తున్న సన్నివేశం కనిపిస్తుంది.**

స్టార్ డైరెక్టర్ లోకేశ్ కనగరాజ్ హీరోగా నటిస్తున్న డీసీ మూవీ ట్రైలర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. ఈ ట్రైలర్‌లో క్రైమ్ యాక్షన్ సన్నివేశాలతో పాటు హీరోయిన్ వామికా గబ్బితో ఉన్న ఎమోషనల్ లవ్ డ్రామా కూడా ఆకట్టుకుంటోంది. ఈ సినిమాకు అరుణ్ మాతేశ్వరన్ దర్శకత్వం వహిస్తుండగా, అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. రాకీ, సాణికాయిదం, కెప్టెన్ మిల్లర్ వంటి సినిమాలను తెరకెక్కించిన అరుణ్ మాతేశ్వరన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాను సన్ పిక్చర్స్ నిర్మిస్తోంది. ఇందులో లోకేశ్ కనగరాజ్ దేవదాస్ అనే పాత్రలో నటిస్తుండగా, వామికా గబ్బి చంద్ర పాత్రలో కనిపించనుంది. ఇప్పటికే విడుదలైన టీజర్ సినిమాపై భారీ అంచనాలను పెంచగా, తాజాగా వచ్చిన ట్రైలర్ మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. మానగరం సినిమాతో డైరెక్టర్ గా పరిచయమైన లోకేశ్ కనగరాజ్, ఆ తర్వాత ఖైదీ సినిమాతో మరో స్థాయికి చేరుకున్నారు. అనంతరం రజనీకాంత్, కమల్ హాసన్, విజయ్ వంటి స్టార్ హీరోలతో సినిమాలు తెరకెక్కించారు. చివరిగా ఆయన తెరకెక్కించిన కూలీ సినిమా మంచి వసూళ్లు సాధించింది. ప్రస్తుతం డైరెక్టర్ గా ఉన్న లోకేశ్ కనగరాజ్, డీసీ సినిమాతో హీరోగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ సినిమాలో సంజనా, వామికా గబ్బి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వేలంటైన్స్ డే సందర్భంగా రిలీజ్ అయిన గ్లింప్స్ వీడియోలో సంజనా సిగరెట్ తాగుతూ కనిపించగా, ఆ గదిలోకి లోకేశ్ ప్రవేశించే సన్నివేశం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇక తాజాగా రిలీజైన ట్రైలర్ ప్రారంభంలోనే కారులో ఒక మహిళ భయంతో కేకలు వేస్తున్న సన్నివేశం కనిపిస్తుంది. ఆ తర్వాత తుపాకీ కాల్పులు, రక్తపాతం, హై వోల్టేజ్ యాక్షన్ సీన్స్‌తో ట్రైలర్ మొత్తం ఉత్కంఠభరితంగా సాగుతుంది. డబ్బు కోసం తమ కుమార్తెను తప్పుదారి పట్టించే తల్లిదండ్రుల నుంచి చంద్రను దేవదాస్ ఎలా కాపాడతాడు అన్నదే సినిమా కథ అని ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. ట్రైలర్ చివర్లో ఆమె పేరు చంద్రరా.. అంటూ ఓ బూతు పదంతో ముగుస్తుంది. దాదాపు మూడు నిమిషాల నిడివి ఉన్న ఈ ట్రైలర్‌లో అనేక అసభ్య పదాలు ఉండటంతో వాటిని మ్యూట్ చేశారు. దీంతో సినిమా మొత్తం ఎలా ఉండబోతుందనే ఆసక్తితో పాటు కొంత సందేహం కూడా అభిమానుల్లో వ్యక్తమవుతోంది. ఈ సినిమాకు అనిరుధ్ సంగీతం అందిస్తున్న సంగతి తెలిసిందే.



# ఇండిపెండెంట్ మ్యూజిక్‌తోనూ అద్భుతాలు!

డిజిటల్ యుగంలో సక్సెస్ అవ్వడానికి ట్యాలెంట్ ఉంటే చాలు. ప్రత్యేకించి సినిమా రంగంలో స్థిరపడాలనుకునే వారికి డిజిటల్ మాధ్యమాలు ఎంతగా దోహదపడుతున్నాయో తెలిసిందే. ట్యాలెంట్ ను ప్రూవ్ చేసుకుంటూ ఒక్క వీడియో చేస్తే చాలు.. అది చేరాల్సిన వారికి చేరితో ప్రతిభను గుర్తించి పిలిచి మరీ అవకాశాలిస్తోన్న రోజులివి. ఈ మధ్య కాలంలో అలా వెలుగులోకి వస్తోన్న సంగీత దర్శకుల సంఖ్య అంతకంతకు పెరుగుతోంది. ఇండిపెండెంట్ సంగీతానికి కూడా శ్రోతలను విశేషంగా అలరిస్తోంది. ఈ క్రమంలోనే ప్రముఖ సింగర్ కయాన్ ఇండిపెండెంట్ మ్యూజిక్ సాధిస్తున్న పురోగతి గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించారు. స్వతంత్ర సంగీతానికి అద్భుతమైన సమయం నడుస్తోంది. గతంలో సినిమా పాటల నీడలో మరుగున పడిపోయిన ఇండిపెండెంట్ కళాకారులకు డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా ప్రపంచవ్యాప్త గుర్తింపు లభిస్తోందన్నారు. -మనం ఇప్పుడు గ్లోబల్ విలేజ్‌లో ఉన్నాం. ఇక్కడ సంగీతం ఒక ప్రాంతానికే పరిమితం కాదు. ఆధునిక బీట్స్ కలయికతో వస్తోన్న పాటలను ప్రపంచవ్యాప్తంగా ఆదరిస్తున్నారన్నారు. ఇలాంటి ఎలాంటి ఒత్తిళ్లకు గురవుతున్నారో కూడా వివరించారు. సింగర్‌ను , మ్యుజీషియన్‌ను ఒకే రకమైన శైలికి పరిమితం చేయాలని చూడటం సరికాదని కయాన్ అన్నారు. తాను ఎప్పుడూ రొటీన్ పద్ధతులకు లొంగిపోలేదని నచ్చిన రీతిలో ప్రయోగాలు చేయడానికే ఇష్టపడతానన్నారు. ఇండస్ట్రీ నిర్దేశించిన ఫార్ములాలను పాటించకుండా స్వంత అభిరుచితో చేసినప్పుడే నిజమైన కళాఖండాలు పుడతాయని కయాన్ వెల్లడించారు. కానీ స్వతంత్ర కళాకారిణిగా నిలదొక్కుకోవడం అంత సులభం కాదన్నారు. ఇందులో ఎన్నో సవాళ్లు ఎదురవుతుంటాయి. వాటిని అధిగమించి ప్రయాణం చేయాల్సి ఉంటుందుందన్నారు. కానీ ప్రేక్షకుల నుంచి లభిస్తున్న స్పందన చూస్తుంటే? ఎలాంటి ఒత్తిళ్లు అయినా దాటొచ్చు. ఒక్క సక్సెస్ ఎంతో ఉత్సాహాన్ని నింపుతోందన్నారు. మారుతోన్న కాలానికి అనుగుణంగా శ్రోతలు కూడా కొత్త తరహా సంగీతాన్ని ఆస్వాదించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఇది తమలాంటి యంగ్ మ్యుజీషియన్లకు పెద్ద వరమని కయాన్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం భారతీయ స్వతంత్ర సంగీతం ప్రత్యేక అస్తిత్వాన్ని సృష్టించుకుందని అంతా నమ్ముతున్నారు. వెస్ట్రన్ మ్యూజిక్‌ను అనుకరణతో పాటు, మూలాలను మర్చిపోకుండా కొత్తదనాన్ని జోడించడం వల్లే ఇండి మ్యూజిక్ ముమెంటం అందుకుందన్నారు. భవిష్యత్తులో ఈ రంగం మరిన్ని శిఖరాలను అధిరోహిస్తుందని సినిమా సంగీతంతో సమానంగా ఇండి మ్యూజిక్ కూడా రాజ్యమేలుతుందని అభిప్రాయపడ్డారు. కయాన్ వంటి కళాకారులు చూపిస్తున్న తెగువ , సృజనాత్మకత భారతీయ సంగీత రంగాన్ని కొత్త పుంతలు తొక్కిస్తోంది. పరిమితులకు తలొగ్గకుండా? తన గాత్రాన్ని ప్రపంచానికి వినిపిస్తున్న ఆమె ప్రయాణం ఎంతోమందికి స్ఫూర్తిదాయకం. ఇండిపెండెంట్ మ్యూజిక్ ట్రెండ్ మాత్రమే కాదు. అది భారతీయ కళాకారుల స్వేచ్ఛకు చిహ్నమని కయాన్ మాటలు నిరూపిస్తున్నాయి

# ఆంధ్రావాలా ఫ్లాపవుతుందని ముందే తెలుసు!



టాలీవుడ్‌లో భారీ అంచనాల మధ్య విడుదలై తీవ్ర నిరాశ మిగిల్చిన సినిమాల లిస్ట్ లో జూనియర్ ఎన్టీఆర్- పూరీ జగన్నాథ్ కాంబినేషన్‌లో వచ్చిన ఆంధ్రావాలా పేరు ఇప్పటికీ ప్రత్యేకంగా వినిపిస్తుంటుంది. 2004లో రిలీజైన ఈ సినిమా అప్పట్లో ఎన్టీఆర్ కెరీర్‌లోనే అత్యంత హైప్ క్రియేట్ చేసిన ప్రాజెక్టులలో ఒకటిగా నిలిచింది. ఫస్ట్ లుక్ నుంచి ఆడియో వరకు అభిమానుల్లో విపరీతమైన అంచనాలు పెంచిన ఈ సినిమా, రిలీజ్ తర్వాత మాత్రం బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా మారింది. తాజాగా ఈ సినిమాపై ప్రముఖ ఎడిటర్ కె. మార్తాండ్ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన, ఆంధ్రావాలా సినిమా అండర్ ప్రొడక్షన్‌లో ఉన్నప్పుడే ఇది వర్కౌట్ కావడం కష్టమని చెప్పాను. కానీ దర్శకుడు పూరీ జగన్నాథ్ వినలేదని చెప్పడం ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చకు దారితీసింది. ముఖ్యంగా ఒక పెద్ద సినిమా నిర్మాణ దశలోనే దాని ఫలితం గురించి టెక్నీషియన్లు అంచనా వేయడం ఆసక్తికరంగా మారింది. ఇండస్ట్రీలోని చాలామందికి స్క్రిప్ట్ దశలోనే ఒక ప్రాజెక్ట్ భవిష్యత్తుపై క్లారిటీ వచ్చేస్తుందని ఇండస్ట్రీలో తరచూ అంటూంటారు. కొంతమంది డైరెక్టర్లు లేదా నిర్మాతలు కథ వర్కౌట్ కాదని భావిస్తే అక్కడికక్కడే ప్రాజెక్ట్‌ను నిలిపివేస్తారు. మరికొందరు షూటింగ్ ప్రారంభమైన తర్వాత లోపాలు గుర్తించి స్క్రిప్ట్‌లో మార్పులు చేస్తూ సినిమాను కొత్త దారిలో తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తారు. కానీ కొన్ని సందర్భాల్లో పరిస్థితులు పూర్తిగా చేతిలో లేకపోవడంతో టెక్నీషియన్లు కేవలం తమ బాధ్యతను పూర్తి చేయడానికే పరిమితమవుతారు. మార్తాండ్ వ్యాఖ్యలు కూడా ఇదే విషయాన్ని గుర్తు చేస్తున్నాయి. ఆయన చెప్పినట్లుగా, సినిమా ఫలితం ఎలా ఉండబోతుందో తెలిసినా, ఒకసారి భారీ స్థాయిలో షూటింగ్ ప్రారంభమైన తర్వాత దాన్ని ఆపడం సాధ్యం కాని పరిస్థితి ఏర్పడుతుంటుంది. ముఖ్యంగా స్టార్ హీరోల సినిమాల్లో అభిమానుల అంచనాలు, నిర్మాతల పెట్టుబడులు, మార్కెట్ ఒత్తిళ్లు కలిసి నిర్ణయాలను ప్రభావితం చేస్తుంటాయి. ఆంధ్రావాలా విషయంలో కూడా అలాంటి పరిస్థితులే నెలకొన్నాయని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఆంధ్రావాలా ఫ్లాప్‌తో ముగిసిపోయిన ఈ కాంబినేషన్, దాదాపు పదేళ్ల తర్వాత మళ్లీ కలిసి టెంపర్ రూపంలో బాక్సాఫీస్‌ను షేక్ చేసింది. పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా జూనియర్ ఎన్టీఆర్ కెరీర్‌కు కీలక మలుపుగా నిలిచింది. యాక్షన్, ఎమోషన్, డైలాగ్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకున్న టెంపర్ భారీ విజయాన్ని అందుకుని ఎన్టీఆర్ ఇమేజ్‌ను మరో స్థాయికి తీసుకెళ్లింది. ముఖ్యంగా ఆ సినిమా తర్వాత ఎన్టీఆర్ ఎంపిక చేసుకున్న కథలు, నటనలో వచ్చిన మార్పు ఆయన కెరీర్‌ను కొత్త దిశగా మలిచాయి. ప్రస్తుతం మార్తాండ్ చేసిన కామెంట్స్ వైరల్ అవుతుండగా, అభిమానులు మాత్రం ఆంధ్రావాలా నుంచి టెంపర్ వరకు ఈ కాంబో ప్రయాణాన్ని మరోసారి గుర్తుచేసుకుంటున్నారు.

# చిరంజీవి, విజయ్.. సర్ ప్రైజ్ కాల్!

ఒక సీనియర్ నటుడిగా చిరంజీవి ఇచ్చిన ఈ బూస్టప్ విజయ్ కి ఎంతో బలాన్నిచ్చేదే. ప్రజా సేవలో విజయ్ మరిన్ని సక్సెస్ లు చూడాలని చిరంజీవి తన మనసులోని మాటను చెప్పారు.



తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న విజయ్ కి ఇప్పుడు దేశవ్యాప్తంగా సినీ స్టార్స్ నుంచి విషెస్ అందుతున్నాయి. ఊహించని విధంగా మొదటి అడుగులోనే సీఎం సీటు ఎక్కి అందరిని ఆశ్చర్య పరిచిన విజయ్ తన స్టార్ హోదా ఏమిటో మరోసారి నిరూపించారు. ఇక మెగాస్టార్ చిరంజీవి ఫోన్ చేయడం ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారింది. ఒకరు వెండితెరను దశాబ్దాలుగా ఏలుతున్న హీరో అయితే, మరొకరు సినిమాల్లో సత్తా చాటి ఇప్పుడు ప్రజా క్షేత్రంలో కీలక పదవిలో ఉన్న నేత. 00:04 / 02:25 వీరిద్దరి మధ్య సాగిన ఈ ఆత్మీయ సంభాషణ తెలుగు, తమిళ రాష్ట్రాల్లో అందరి దృష్టిని ఆకర్షించింది. విజయ్ సీఎం అయ్యాక జరిగిన ఈ తొలి అధికారిక పలకరింపుకు ఇప్పుడు చాలా ప్రాధాన్యత పెరిగింది. విజయ్ పాలన దివంగత నేత ఎం.జి.ఆర్ గారి లాగే సాగాలని చిరంజీవి కోరుకున్నారు. ప్రజల కోసం చేసే పనుల్లో విజయ్ తనదైన ముద్ర వేయాలని, అందరి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోవాలని చిరంజీవి అభినందించారు. ఒక సీనియర్ నటుడిగా చిరంజీవి ఇచ్చిన ఈ బూస్టప్ విజయ్ కి ఎంతో బలాన్నిచ్చేదే. ప్రజా సేవలో విజయ్ మరిన్ని సక్సెస్ లు చూడాలని చిరంజీవి తన మనసులోని మాటను చెప్పారు. అలాగే విజయ్ కూడా మెగాస్టార్ మీద తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ఇటీవల చిరంజీవి నటించిన "మన శంకర వర ప్రసాద్ గారు" సినిమా చూశానని విజయ్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. చిరంజీవిని మళ్ళీ ఆ రేంజ్ పాత్రలో స్క్రీన్ మీద చూడటం చాలా హ్యాపీగా అనిపించిందని విజయ్ అనడం విశేషం. ఒక ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి కూడా తన తోటి నటుడి సినిమా గురించి స్పెషల్ గా ప్రస్తావించడం ఫ్యాన్స్ ని ఖుషీ చేస్తోంది. శుభాకాంక్షలతోనే ఆగిపోకుండా చిరంజీవి నెక్స్ట్ ప్రాజెక్టుల గురించి కూడా విజయ్ ఆరా తీశారు. ప్రస్తుతం కె.వి.ఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌లో మెగాస్టార్ చేస్తున్న కొత్త సినిమాకు విజయ్ ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఇండస్ట్రీ వ్యక్తులు ఇలాంటి ఉన్నత పదవుల్లో ఉన్నప్పుడు ఇలాంటి పలకరింపులు సినిమా రంగానికి ఒక రకమైన భరోసానిస్తాయి. భాష ఏదైనా ఒకరి సినిమాలను ఒకరు గౌరవించుకోవడం ఒక మంచి పద్ధతి. నిజానికి గతంలో కూడా తెలుగు, తమిళ స్టార్ల మధ్య మంచి బాండింగ్ ఉండేది. ఇప్పుడు విజయ్ ముఖ్యమంత్రి కావడంతో ఆ బంధం ఇంకా స్ట్రాంగ్ అయ్యే ఛాన్స్ ఉంది. చిరంజీవి, విజయ్ మధ్య జరిగిన ఈ టాక్ కేవలం రాజకీయ సంబంధం మాత్రమే కాదు, ఒక మంచి ఫ్రెండ్ షిప్ అని ఫ్యాన్స్ చెబుతున్నారు. పాలిటిక్స్ వేరైనా కళాకారులుగా వారి మధ్య ఉన్న రెస్పెక్ట్ ఏమాత్రం తగ్గలేదని ఈ ఇన్సిడెంట్ తో అర్థమవుతోంది. ఇక ఇద్దరు సూపర్ స్టార్లు ఇలా మాట్లాడుకోవడం అటు మెగా ఫ్యాన్స్ కి, ఇటు విజయ్ ఫ్యాన్స్ కి పెద్ద కిక్ ఇచ్చింది. రెండు రాష్ట్రాల మధ్య సంబంధాలు ఇంకా మెరుగుపడటానికి ఇలాంటి ఆత్మీయ కలయికలు బాగా హెల్ప్ అవుతాయి. మెగాస్టార్, సీఎం విజయ్ ల ఈ స్నేహం ముందు ముందు ఇంకెన్ని ఇంట్రెస్టింగ్ పరిణామాలకు దారితీస్తుందో చూడాలి.

# బ్లాక్ గౌనులో సెగలు పుట్టిస్తున్న రకుల్ ప్రీత్ సింగ్!

అందులో భాగంగానే ఇన్స్టాగ్రామ్ వేదికగా తాజాగా పంచుకున్న ఈ అవుట్ ఫిట్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటుంది.









ఇటీవల కాలంలో సెలబ్రిటీలు నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ అభిమానులను ఆకట్టుకోవడమే కాకుండా తన గ్లామర్ తో ఫాలోవర్స్ ను పెంచుకుంటున్నారు. ఒకవైపు సినిమా షూటింగ్ లతో ఎంత బిజీగా ఉన్నా మరొకవైపు ఫాలోవర్స్ ను, నెటిజన్స్ ను ఆకట్టుకోవడానికి ఇలా వరుస ఫోటోషూట్స్ తో సోషల్ మీడియాలో సందడి చేస్తున్నారు. అందులో భాగంగానే ప్రముఖ బ్యూటీ రకుల్ ప్రీత్ సింగ్ కూడా తన అందాల సోయగాలతో మరొకసారి అభిమానులను మైమరిపింపచేసే ప్రయత్నం చేసింది . బ్లాక్ అవుట్ ఫిట్ లో గ్లామర్ లుక్ ఇచ్చిన రకుల్.. అందులో భాగంగానే ఇన్స్టాగ్రామ్ వేదికగా తాజాగా పంచుకున్న ఈ అవుట్ ఫిట్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా ఫ్యాషన్ ప్రియులకు ఇదొక ట్రెండీ ఔట్ఫిట్ గా నిలిచింది .అందులో గ్లామర్ వలకబోస్తూ షేర్ చేసిన ఫోటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఇక ఈ బ్లాక్ గౌన్ కి పర్ఫెక్ట్ మ్యాచ్ అయ్యేలా సిల్వర్ కలర్ బ్లాక్ కలర్ ఫింగర్ రింగ్స్ ధరించిన ఈమె.. జుట్టును వేవ్ లా వదిలేసి సింపుల్ స్టైల్ తో ఆకట్టుకుంది. ముఖ్యంగా ఫ్రాక్ కి తగ్గట్టుగా బోసి నెక్ తో.. నడుము మీద చెయ్యి పెట్టి వయ్యారంగా ఫోటోలకు ఫోజులిచ్చింది. మరికొన్ని ఫోటోలలో సెల్ఫీతో ఆకట్టుకుంది. మొత్తానికి రకుల్ ప్రీత్ సింగ్ షేర్ చేసిన ఈ ఫోటో గ్యాలరీ అభిమానులను ఆకట్టుకుంటుంది. థియేటర్లోకి వచ్చిన రకుల్ కొత్త సినిమా.. ఇదిలా ఉండగా ప్రస్తుతం బాలీవుడ్ లోనే వరుస సినిమాలు చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న రకుల్ ప్రీత్ సింగ్ తాజాగా నటించిన చిత్రం పతి పత్నీ ఔర్ దో.. ప్రముఖ బాలీవుడ్ స్టార్ హీరో ఆయుష్మాన్ ఖురానా, రకుల్ ప్రీత్ సింగ్ , సారా అలీ ఖాన్, వామికా గబ్బిలు హీరోయిన్లుగా నటించిన ఈ సినిమాను టీ సిరీస్, బి.ఆర్ స్టూడియోస్ బ్యానర్లపై రేణు రవి చోప్రా, కృష్ణన్ కుమార్ , భూషణ్ కుమార్ లు సంయుక్తంగా నిర్మించారు. రొమాంటిక్ కామెడీ డ్రామాగా వచ్చిన ఈ సినిమాకి ముదసర్ అజీజ్ దర్శకత్వం వహించారు. విజయ రాజ్, దుర్గేష్ కుమార్, దీపిక అమీన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఇక భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చింది ఈ సినిమా. ఈ సినిమా మొదటి షో తోనే మంచి పాజిటివ్ టాక్ తెచ్చుకోవడం విశేషం. రకుల్ ప్రీత్ సింగ్ కెరియర్.. కెరటం సినిమా ద్వారా తెలుగు ప్రేక్షకులను పలకరించిన రకుల్ ప్రీత్ సింగ్.. వెంకటాద్రి ఎక్స్ప్రెస్ సినిమాతో మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. తర్వాత పలువురు టాలీవుడ్ స్టార్ హీరోల సరసన నటించి భారీ పాపులారిటీ అందుకున్న ఈ బ్యూటీ.. కెరియర్ పీక్స్ లో ఉండగానే మన్మధుడు వంటి చిత్రంలో నటించి విమర్శలు ఎదుర్కొంది. ఇక ఇప్పుడు బాలీవుడ్ లోనే సినిమాలు చేస్తూ బిజీగా మారిపోయింది ఈ ముద్దుగుమ్మ. ప్రస్తుతం రకుల్ ప్రీత్ సింగ్ బాలీవుడ్ లోనే సినిమాలు చేస్తూ అక్కడ వరుస విజయాలను అందుకుంటూ తన అద్భుతమైన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకోవడమే కాకుండా తన నటనకు తగ్గట్టుగా అవార్డుల రూపంలో గౌరవాలను కూడా అందుకుంటుంది ఈ ముద్దుగుమ్మ.

Editor, Printed, Published and Owned by"MASAPOGU ESWARAIAH ,"H.No - 77/1361-E-2-2-E, Faruk Nagar, (Srinivasa Nagar), Aditya Nagar, Kallur Estate, Kallur(M), Kurnool Dist-518003, Andhra Pradesh, R N I , APTEL 2 0 2 2 / 8 4 0 4 2"Printed at SK PUBLICATIONS, S.NO-46-683-A, BUDHAWARA PETA, KURNOOL DIST-518002, AP. E-mail : akhandabhoomitelugudaily@gmail.com, Cell : +91 9440912389, 9490315559